UDYAM-TS-02-0308842 www.prathighatana.com

# ప్రతిఘటన

తెలుగు దిన పత్రిక జనం కోసం...

హైదరాబాద్ | సంపుటి : 1 | సంచిక : 30 | పేజీలు : 8 | మంగళవారం 24 ఫిబ్రవరి 2026 | వెల : 4/-


## ట్రేడ్ డీల్ వాయిదా

**న్యూఢిల్లీ :** భారతదేశం–అమెరికా మధ్య తాత్కాలిక వాణిజ్య ఒప్పందాన్ని ఖరారు చేయడానికి ఫిబ్రవరి 23న వాషింగ్టన్‌లో ప్రారంభం కావాల్సిన చర్చలు వాయిదా పడ్డాయి. ఒప్పందంలో భాగంగా జరగాల్సిన ప్రధాన సంధానకర్తల కీలకమైన సమావేశం సోమవారం ప్రారంభం కావాల్సి ఉంది. ట్రంప్‌నకు వ్యతిరేకంగా అమెరికా సుప్రీంకోర్టు చారిత్రాత్మక తీర్పు, తర్వాత ప్రకటించిన కొత్త పన్ను విధానాలు అనిశ్చితిని పెంచాయి. దీంతో సమావేశం వాయిదా పడింది. దర్పన్ జైన్ నేతృత్వంలోని భారత ప్రతినిధి బృందం, అమెరికా వాణిజ్య ప్రతినిధి జామిసన్ గ్రీర్, అతని బృందం సమావేశం కావాల్సి ఉంది. ఫిబ్రవరి 20న, ట్రంప్ పరిపాలన విధించిన దిగుమతి పన్నులు రాజ్యాంగ విరుద్ధమని అమెరికా సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. దీని తర్వాత, ఫిబ్రవరి 24 నుంచి అన్ని దేశాలపై కొత్తగా 10 శాతం పన్ను విధిస్తామని ట్రంప్ ప్రకటించారు.




### తమిళనాడులో 74 లక్షల

## ఓట్లు తొలగింపు

- తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలకు మోగనున్న ఎన్నికల నగారా
- ప్రత్యేక సమగ్ర సవరణ అనంతరం తుది ఓటర్ల జాబితాను విడుదల చేసిన ఎన్నికల సంఘం
- పురుషుల కంటే మహిళా ఓటర్లే అధికం

# 2027లో జనగణన ప్రక్రియ

- హైదరాబాద్ మెట్రోను పూర్తిగా స్వాధీనం చేసుకోవాలని కేబినెట్ నిర్ణయం
- కొనసాగుతున్న రాష్ట్ర మంత్రివర్గ సమావేశం
- శాసనసభ బడ్జెట్ సమావేశాలపై మంత్రివర్గ భేటీలో చర్చ
- మెట్రోను ఎల్ అండ్ టీ నుంచి స్వాధీనం చేసుకోవాలని కేబినెట్ నిర్ణయం



హైదరాబాద్

సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన కేబినెట్ భేటీ కొనసాగుతోంది. మంత్రివర్గ సమావేశంలో పలు అంశాలపై చర్చిస్తున్నారు. ముఖ్యంగా శాసనసభ బడ్జెట్ సమావేశాలపై భేటీలో చర్చ జరుగుతోంది. వేసవి కాలం మొదలైనందున వచ్చే 3 నెలలపాటు తాగునీటి సరఫరా ప్రణాళికతో పాటు, ఆరోగ్యం, విద్యకు సంబంధించిన అంశాలపై కేబినెట్‌లో చర్చ జరుగుతున్నట్లు సమాచారం. హైదరాబాద్ మెట్రోను ఎల్ అండ్ టీ నుంచి పూర్తిగా స్వాధీనం చేసుకోవాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన జనగణన 2027ను చేపట్టేందుకు రాష్ట్రంలో ప్రభుత్వం చేస్తున్న ఏర్పాట్లపై మంత్రివర్గం చర్చించినట్లు సమాచారం. రెండో దశ జనగణన ప్రక్రియ వచ్చే ఏడాది - మిగతా3లో



## గ్లోబల్ వాల్యూ క్రియేషన్ హబ్‌గా 'హైదరాబాద్'

'రెడీ టూ వర్క్ ఫోర్స్' గా తెలంగాణ యువత

ఆవిష్కరణలకు ఊతమిచ్చే ఇన్నోవేషన్ ఎకో సిస్టం

'ది హార్ట్ ఫోర్డ్ ఇండియా టెక్నాలజీ సెంటర్' ప్రారంభోత్సవంలో మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్

ఐటీ మాత్రమే కాకుండా బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, లైఫ్ సైన్సెస్, హెల్త్ కేర్, ఏరో స్పేస్, మాన్యుఫ్యాక్చరింగ్, ఫిన్ టెక్, డీప్ టెక్, రిటైల్ తదితర రంగాల్లోనూ హైదరాబాద్ ను 'గ్లోబల్ వాల్యూ క్రియేషన్ హబ్'గా మార్చేందుకు తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పునరుద్ఘాటించారు. అందు కోసం... పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా తెలంగాణ యువతను 'రెడీ టూ వర్క్ ఫోర్స్'గా తీర్చిదిద్దడం, నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించే గ్లోబల్ ఇన్నోవేషన్ ఎకోసిస్టం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. సోమవారం నానక్ రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ లో - మిగతా3లో



## బెంగాల్‌లో అధికార మార్పు తీసుకురావాలి

- ఆ రాష్ట్ర ప్రజలకు మోదీ లేఖ
- త్వరలో బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలు
- ఈ నేపథ్యంలో బెంగాల్ ప్రజలకు ప్రధాని మోదీ లేఖ
- బెంగాల్‌లో అధికార మార్పు తీసుకురావాలని పిలుపు

## వివక్ష సమస్య ఎక్కడ ఎదురైనా రాహుల్ గాంధీ అక్కడ ప్రత్యక్షం అవుతారు



రాహుల్ గాంధీ ప్రధాని అయితేనే దేశంలో రుగ్మతలకు పరిష్కారం

దేశంలో విప్లవాత్మక మార్పులు తెచ్చిన కాంగ్రెస్ పార్టీని కనుమరుగు చేయాలని బిజెపి ప్రయత్నం చేస్తుంది

ఆంధ్ర ప్రదేశ్ , తెలంగాణ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుల శిక్షణ శిబిరంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

"కుల సమస్యలు, రిజర్వేషన్లు, కాంగ్రెస్ వాదిగా కుల వివక్ష నిర్మూలనకు ఎలా పోరాటం చేయాలి"

హైదరాబాద్

రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అయితేనే ఈ దేశంలోనే రుగ్మతలకు పరిష్కారం లభిస్తుందని, ఆయనను ప్రధానమంత్రిగా చేసే వరకు రెండు రాష్ట్రాల జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నిరంతరం పనిచేయాలి రెండు రాష్ట్రాల్లో అత్యధిక ఎంపీ స్థానాలు గెలుచుకునేలా కృషి చేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. సోమవారం ఆయన వికారాబాద్‌లో నిర్వహిస్తున్న జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుల శిక్షణ శిబిరం లో మాట్లాడారు. "కుల సమస్యలు, రిజర్వేషన్లు, కాంగ్రెస్ వాదిగా కుల వివక్ష నిర్మూలనకు ఎలా పోరాటం చేయాలి" అన్న అంశంపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రసంగించారు. దేశంలో అంటరానితనం, వివక్ష సమస్య ఎక్కడ ఎదురైనా రాహుల్ గాంధీ అక్కడ ప్రత్యక్షం అవుతారు అని తెలిపారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో రోహిత్ వేముల కుల వివక్షను భరించలేక బలవన్మరణానికి పాల్పడితే రాహుల్ గాంధీ నేరుగా యూనివర్సిటీకి చేరుకొని విద్యార్థులతో చర్చించి పోరాట విధానాన్ని ఖరారు చేశారని తెలిపారు. - మిగతా3లో

### తెలంగాణలో జనసేన పార్టీ

# బలోపేతం

పవన్ కల్యాణ్ కీలక నిర్ణయం

పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభించనున్నట్లు వెల్లడి

ఈ నెల 26 నుంచి 'ఉద్యమి' సభ్యత్వ నమోదు కార్యక్రమం

జిల్లాలు, లోక్ సభ సభ్యుల వారీగా ఇన్‌ఛార్జుల నియామకం

హైదరాబాద్



జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ తెలంగాణలో క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేసేందుకు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇందులో భాగంగా పార్టీ సభ్యత్వ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు జనసేన తెలంగాణ విభాగం ప్రకటన విడుదల చేసింది. సభ్యత్వ నమోదు కార్యక్రమం కోసం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. జనసేన పార్టీ 'ఉద్యమి' సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఈ నెల 26వ తేదీ నుంచి దేశవ్యాప్తంగా నిర్వహించాలని పవన్ కల్యాణ్ నిర్ణయించారు. ఈ నేపథ్యంలో తెలంగాణలో పార్టీని 'ఉద్యమి' సభ్యత్వ నమోదు కార్యక్రమం ద్వారా క్షేత్రస్థాయిలో బలంగా తీసుకెళ్లి, సంస్థాగతంగా బలోపేతం చేయడానికి జిల్లాలవారీగా కొంతమంది నాయకులకు ఇన్‌ఛార్జ్ బాధ్యతలను అప్పగించారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో నూతనంగా ఏర్పడిన మూడు కార్పొరేషన్‌లకు వేర్వేరు ఇన్‌ఛార్జులను నియమించారు. జనసేన పార్టీ ఉపాధ్యక్షులు బొంగునూరి మహేందర్, తెలంగాణ రాష్ట్ర ఇన్‌ఛార్జ్ నేమూరి శంకర్ గౌడ్, పార్టీ నాయకులు రాధారాం రాజలింగం, కావ్య మండపాక, శిరీష పొన్నూరి రాష్ట్రస్థాయిలో పర్యవేక్షిస్తారని ఆ ప్రకటనలో జనసేన పార్టీ తెలిపింది. ఆయా పార్లమెంట్ పరిధిలో సభ్యత్వ నమోదు కార్యక్రమాల బాధ్యతను రసువుకు నాయకులకు అప్పగించారు.



## ఏ దేశమైనా ఆటలాడాలని చూస్తే భారీ టారిఫ్ విధిస్తాం

- సుప్రీంకోర్టు తీర్పును అలుసుగా తీసుకుంటే ఊరుకునేది లేదని హెచ్చరిక
- సుప్రీంకోర్టు తనకు తెలియకుండానే మరిన్ని అధికారాలు కట్టబెట్టిందని వ్యాఖ్య
- దశాబ్దాలుగా కొన్ని దేశాలు అమెరికాను కొల్లగొట్టాయని ఆరోపణ

# ఎవరికో సీటు?

రాష్ట్రంలో రాజ్యసభ సీట్ల కోసం పెద్ద సంఖ్యలో ఆశావహుల పోటీ

మార్చి 3 వరకు నామినేషన్లకు గడువు ఉండటంతో ఎంపికపై కసరత్తు షురూ

ఢిల్లీలో అధిష్ఠానం వద్ద లాబీయింగ్ చేస్తున్న కొందరు నేతలు

హైదరాబాద్

రాష్ట్రంలో రాజ్యసభ సీట్ల కోసం కాంగ్రెస్ పార్టీలో పెద్ద సంఖ్యలో ఆశావహులు పోటీ పడుతున్నారు. మార్చి 3 వరకు నామినేషన్లకు గడువు ఉండటంతో అభ్యర్థుల ఎంపికపై కసరత్తు ముమ్మరమైంది. కొందరు ఢిల్లీలో అధిష్ఠానం వద్ద లాబీయింగ్ చేస్తున్నారు. మరికొందరు రాష్ట్రంలో ముఖ్యమంత్రి, పీసీసీ అధ్యక్షుడి ద్వారా ప్రయత్నాలు జరుపుతున్నారు. జాతీయ ప్రయోజనాలు, రాష్ట్ర ప్రయోజనాలు, సామాజిక సమతౌల్యం ఈ మూడు అంశాలను దృష్టిలో పెట్టుకుని ఇద్దరు అభ్యర్థులను ఎంపిక చేసే దిశగా రాష్ట్ర, జాతీయ నాయకత్వాలు కసరత్తు చేస్తున్నాయి. రాష్ట్రంలో రాజ్యసభ ఎన్నికల వేడి పెరిగింది. రెండు సీట్లు ఖాళీ కావడంతో వాటి భర్తీకి అవసరమైన పూర్తి - మిగతా3లో



ప్రతిఘటన
తెలుగు దిన పత్రిక
మంగళవారం 24
ఫిబ్రవరి 2026

## తమిళనాడులో 74 లక్షల ఓట్లు తొలగింపు

తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికల నగారా మోగనున్న తరుణంలో ఓటర్ల జాబితా ప్రక్షాళన ప్రక్రియ ఒక కొలిక్కి వచ్చింది. ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ అనంతరం ఈరోజు తుది జాబితాను రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి అర్చనా పట్నాయక్ విడుదల చేశారు. తాజా జాబితా ప్రకారం రాష్ట్రంలో మొత్తం ఓటర్ల సంఖ్య 5.67 కోట్లుగా నమోదైంది. గతంలో ఉన్న 6.41 కోట్ల ఓటర్లతో పోలిస్తే, ఈ ప్రక్షాళనలో ఏకంగా 74 లక్షల మంది ఓటర్లను జాబితా నుంచి తొలగించడం గమనార్హం. డూప్లికేట్ ఓట్లు, మరణించిన వారి పేర్లు, నివాసం మారుతున్న వారి వివరాలను క్షుణ్ణంగా వెరిఫై చేసిన తర్వాతే ఈ భారీ తొలగింపులు చేపట్టినట్లు అధికారులు వెల్లడించారు. లింగ నిష్పత్తి పరంగా చూస్తే ఈసారి కూడా తమిళనాడులో మహిళా ఓటర్లే ఆధిపత్యం ప్రదర్శిస్తున్నారు. మొత్తం 5,67,07,380 మంది ఓటర్లలో 2.89 కోట్ల మంది మహిళలు ఉండగా, 2.77 కోట్ల మంది పురుషులు, 7,617 మంది ట్రాన్స్‌జెండర్లు ఉన్నారు. డిసెంబర్ 19 నుంచి జనవరి 30 వరకు వచ్చిన లక్షలాది అప్లికేషన్లను పరిశీలించి, అర్హులైన కొత్త ఓటర్లను కూడా జాబితాలో చేర్చారు. ఈ వేసవిలో జరగబోయే ఎన్నికల కోసం ఈ జాబితానే కీలకం కానుంది.

## తేజస్ 'క్రాష్' కాలేదు..

## చిన్న సాంకేతిక సమస్యే: హెచ్‌ఏఎల్ స్పష్టత

భారత వైమానిక దళానికి చెందిన తేలికపాటి యుద్ధ విమానం (ఎల్‌సీఏ) తేజస్ 'క్రాష్' అయిందంటూ వచ్చిన మీడియా నివేదికలను హిందుస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్‌ఏఎల్) ఖండించింది. అది ప్రమాదం కాదని, కేవలం ఒక చిన్న సాంకేతిక సమస్య మాత్రమేనని సోమవారం స్పష్టం చేసింది. ఈ మేరకు హెచ్‌ఏఎల్ అధికారిక ప్రకటన విడుదల చేసింది. "తేజస్ ఘటనపై వచ్చిన మీడియా కథనాలను గమనించాం. ఇందులో వాస్తవాలను స్పష్టం చేయాలనుకుంటున్నాం. తేజస్ విమానం క్రాష్ అయినట్లు ఎటువంటి నివేదిక లేదు. అది కేవలం ఒక చిన్న సాంకేతిక సమస్య మాత్రమే" అని హెచ్‌ఏఎల్ తన ప్రకటనలో పేర్కొంది. సమకాలీన యుద్ధ విమానాల్లో ప్రపంచంలోనే అత్యుత్తమ భద్రతా రికార్డులు తేజస్ సొంతమని బలంగా సమర్థించుకుంది. ఈ సమస్యపై నిబంధనల ప్రకారం లోతైన విశ్లేషణ చేస్తున్నామని, భారత వైమానిక దళంతో కలిసి త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని తెలిపింది. ఫిబ్రవరి 7న ఒక ఫ్రంట్‌లైన్ ఎయిర్‌బేస్‌లో తేజస్ జెట్ బ్రేక్ ఫెయిల్యూర్ కారణంగా రన్‌వేను దాటిందని, విమానం ఎయిర్‌ఫ్రేమ్‌కు పెద్ద నష్టం వాటిల్లిందని, పైలట్ సురక్షితంగా బయటపడ్డాడని కొన్ని మీడియా నివేదికలు పేర్కొన్నాయి. ఈ నివేదికలను హెచ్‌ఏఎల్ తప్పుడు సమాచారంగా తోసిపుచ్చింది. ఈ ఘటన తర్వాత, భారత వైమానిక దళం (ఐఏఎఫ్) తమ వద్ద ఉన్న సుమారు 30-35 తేజస్ విమానాలన్నింటినీ తనిఖీల కోసం తాత్కాలికంగా నిలిపివేసినట్లు (గ్రౌండెడ్) సమాచారం. ప్రస్తుతం ఈ ఘటనపై భారత వైమానిక దళం 'కోర్ట్ ఆఫ్ ఎంక్వైరీ'కి ఆదేశించింది.

## ఎర్రకోటకు ఖలిస్థానీ ఉగ్రవాదుల బెదిరింపులు



**న్యూఢిల్లీ:** దేశ రాజధాని ఢిల్లీలో సోమవారం హఠాత్తుగా హై అలర్ట్ ప్రకటించారు. చారిత్రక కట్టడం ఎర్రకోటతో పాటు ఢిల్లీ రాష్ట్ర పరిపాలనా కేంద్రమైన సచివాలయానికి (అసెంబ్లీ) బాంబు బెదిరింపులు రావడంతో కలకలం చెలరేగింది. గుర్తు తెలియని వ్యక్తులు ఈ-మెయిల్ ద్వారా పంపిన హెచ్చరికలతో భద్రతా దళాలు వెంటనే అప్రమత్తమయ్యాయి. ఈ బెదిరింపు ఈమెయిల్ ఒక ఖలిస్థానీ ఉగ్రవాద గ్రూపు పేరుతో వచ్చినట్లు ప్రాథమిక సమాచారం అందుతోంది. రాజధానిలోని అత్యంత కీలకమైన ఎర్రకోట, సచివాలయం ప్రాంతాలను బాంబులతో పేల్చివేస్తామన్న సందేశం అందగానే ఢిల్లీ పోలీసులు రంగంలోకి దిగి, గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. ఈ ఘటన నేపథ్యంలో ఢిల్లీ సచివాలయం వద్ద పోలీసులు భారీ భద్రతను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం అసెంబ్లీ ప్రాంగణంలో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. అనుమానాస్పద వస్తువులను గమనిస్తున్నారు. ఒకవైపు గాలింపు చర్యలు కొనసాగుతుండగానే, మరోవైపు ఈ-మెయిల్ మూలాలను కనిపెట్టేందుకు దర్యాప్తు సంస్థలు సాంకేతిక ఆధారాలను విశ్లేషిస్తున్నాయి. ఖలిస్థానీ సానుభూతిపరుల పేరిట వచ్చిన ఈ బెదిరింపుల వెనుక అసలు కుట్రదారులు ఎవరనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ప్రస్తుతం ఢిల్లీవ్యాప్తంగా భద్రతను మరింత కట్టుదిట్టం చేసి, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పర్యవేక్షిస్తున్నారు.

## ఏ దేశమైనా ఆటలాడాలని

## చూస్తే భారీ టారిఫ్ విధిస్తాం

వివిధ దేశాలపై డొనాల్డ్ ట్రంప్ విధించిన అదనపు సుంకాలను అమెరికా సుప్రీంకోర్టు తప్పుబట్టిన విషయం తెలిసిందే. అమెరికా కాంగ్రెస్ అనుమతి లేకుండా వేసిన ఈ సుంకాలు చెల్లవని తీర్పు వెలువరించింది. ఈ తీర్పుపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి స్పందించారు. సుప్రీంకోర్టు తీర్పును అలుసుగా తీసుకుని ఏ దేశమైనా ఆటలాడాలని చూస్తే భారీ టారిఫ్‌లు విధిస్తానని హెచ్చరించారు. సుప్రీంకోర్టు ఈ తీర్పు ద్వారా తెలియకుండానే తనకు మరిన్ని అధికారాలు కట్టబెట్టిందని వ్యాఖ్యానించారు. కొన్ని దేశాలు అమెరికాను దశాబ్దాలుగా కొల్లగొట్టాయని ఆరోపించారు. సుప్రీంకోర్టు తీర్పును ఆధారంగా చేసుకుని, ఇష్టానుసారం వ్యవహరించాలని చూస్తే ఇటీవల అంగీకరించిన సుంకాల కంటే భారీగా ఎదుర్కోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన తన ట్రూత్ సోషల్ మీడియాలో ఈ హెచ్చరిక జారీ చేశారు. అంతర్జాతీయ అత్యయిక ఆర్థిక అధికారాల చట్టంను ఉపయోగించి డొనాల్డ్ ట్రంప్ తన మాట వినని వివిధ దేశాలపై అధిక పన్ను విధించారు. ట్రంప్ అధిక సుంకాలకు అమెరికా కాంగ్రెస్ ఆమోదం లేదు. టారిఫ్ అంశం సుప్రీంకోర్టుకు వెళ్లగా, ట్రంప్ తీరును తప్పుబట్టింది. ఆయన నిర్ణయానికి వ్యతిరేకంగా తీర్పు వెలువరించింది.

## అమెరికా దాడుల భయం..

## ఇరాన్‌లో పరిస్థితి ఉద్రిక్తం..

### తక్షణమే ఆదేశాన్ని వీడండి .. భారత పౌరులకు ఎంబసీ అడ్వయిజరీ

**న్యూ ఢిల్లీ :** ఏ క్షణమైనా ఇరాన్ పై అమెరికా దాడులు చేయవచ్చునన్న అంచనాలు, విద్యార్థుల ఆందోళనలతో ఆ దేశంలో పరిస్థితులు మళ్లీ ఉద్రిక్తంగా మారాయి. ఈ నేపథ్యంలో ఇరాన్‌లోని భారత పౌరులకు అక్కడి మన తాజాగా అడ్వయిజరీ జారీచేసింది. తక్షణమే ఆ దేశాన్ని వీడాలని సూచించింది.'ఇరాన్‌లో మారుతున్న పరిస్థితుల దృష్ట్యా జనవరి 5న భారత ప్రభుత్వం జారీచేసిన మార్గదర్శకాలకు కొనసాగింపుగా మళ్లీ అడ్వయిరీ జారీ చేస్తున్నాం. ప్రస్తుతం ఇరాన్‌లో ఉన్న భారతీయులు (విద్యార్థులు, యాత్రికులు, వ్యాపారవేత్తలు, పర్యాటకులు) కమర్షియల్ విమానాలతో సహా అందుబాటులో ఉన్న ప్రయాణ మార్గాల ద్వారా ఇరాన్‌ను తక్షణమే విడిచిపెట్టి వెళ్లండి. భారత పౌరులు, భారత సంతతి వ్యక్తులు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించండి. ఆందోళనలు జరిగే ప్రాంతాలకు దూరంగా ఉండండి. ఇరాన్‌లోని భారత ఎంబసీతో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరుపుతూ ఉండండి' అని ఇరాన్‌లోని భారత ఎంబసీ తన అడ్వయిజరీలో పేర్కొన్నది.అలాగే తాజా పరిణామాల సమాచారం కోసం స్థానిక మీడియాను గమనిస్తూ ఉండాలని సూచించింది.

# బంగాల్‌లో అధికార మార్పు తీసుకురావాలి

మరికొద్ది నెలల్లో బంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న వేళ ప్రధాని మోదీ కీలక వ్యాఖ్యలు చేశారు. బంగాల్‌లో అధికార మార్పు తీసుకురావాలని (ప్రభుత్వాన్ని మార్చాలని) ప్రజలను కోరారు. బంగాల్‌ను 'సోనార్ బంగ్లా'గా మారుస్తానని హామీ ఇచ్చారు. ఈ మేరకు బంగాల్ ప్రజలకు నరేంద్ర మోదీ సోమవారం లేఖ రాశారు. ఈ లెటర్లను బీజేపీ కార్యకర్తలు రాష్ట్ర ప్రజలకు అందించనున్నారు.



"మరికొద్ది నెలల్లో బంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఆ ఎన్నికలు రాష్ట్ర భవిష్యత్తును నిర్ణయిస్తాయి. రానున్న తరం భవిష్యత్తు మీరు బాగా ఆలోచించి తీసుకునే నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది. నేడు 'సోనార్ బంగ్లా' గురించి కలలు కనే ప్రతి యువకుడు, వృద్ధుడు, మహిళలు చాలా బాధలో ఉన్నారు. వారి బాధ నా హృదయాన్ని తాకింది. అందువల్ల నేను నా గుండె లోతుల్లో నుంచి ఒక తీర్మానం చేస్తున్నాను. బంగాల్‌ను వికసిత్ (అభివృద్ధి చెందిన), సంపన్నమైన రాష్ట్రంగా మార్చాలనేది నా సంకల్పం" అని మోదీ లేఖలో పేర్కొన్నారు.

### టీఎంసీపై విమర్శలు

గత 11 ఏళ్లుగా దేశ ప్రజల ఆశీర్వాద బలంతో తమ ప్రభుత్వం ప్రజా సంక్షేమం, సమగ్ర అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యతనిచ్చిందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. రైతుల సంక్షేమం నుంచి యువత కలలను నెరవేర్చడం వరకు, మహిళలను సాధికారపరచడం నుంచి సమాజంలోని ప్రతి వర్గాన్ని చేరుకోవడం వరకు తమ ప్రభుత్వ విధానాలు, నిరంతర ప్రయత్నాల సానుకూల ఫలితాలు నేడు స్పష్టంగా కనిపిస్తున్నాయని అన్నారు. ఈ క్రమంలో బంగాల్‌లో అధికారంలో ఉన్న టీఎంసీ సర్కార్‌పై మోదీ మండిపడ్డారు.

"బంగాల్ ప్రభుత్వం నుంచి సరైన సహకారం లేకపోయినా రాష్ట్రంలో దాదాపు 5 కోట్ల మంది ప్రజల చేత 'జన్ ధన్ యోజన' ఖాతాలు ఓపెన్ చేయించాం. 'స్వచ్ఛ భారత్ అభియాన్' కింద రాష్ట్రంలో 85 లక్షల మరుగుదొడ్లు నిర్మించాం. బంగాల్‌ను పాలిస్తున్న టీఎంసీ సర్కార్ పేదల జీవనోపాధిని లాక్కుంటోంది. మేము మాత్రం చిరు వ్యాపారులు, వ్యవస్థాపకులకు రూ.2.82 లక్షల కోట్ల విలువైన రుణాలు అందించాం. 'అటల్ పెన్షన్ యోజన' కింద 56 లక్షల మంది సీనియర్ సీటిజెన్స్‌కు ఊరట కల్పించాం. 'ఉజ్వల యోజన' ద్వారా కోటి కుటుంబాలకు ఎల్‌పీజీ కనెక్షన్‌లను అందించాం. తద్వారా మాతృమూర్తులు, సోదరీమణులను పొగ నుంచి విముక్తి కల్పించాం."

### అన్నదాతల ముఖాల్లో చిరునవ్వులు నింపాం!

బంగాల్ రైతులు దేశం మొత్తానికి ఆహారం సరఫరా చేస్తున్నారని, కానీ తమ కుటుంబాలను పోషించడానికి వారు కష్టపడుతున్నారని మోదీ అన్నారు. ఇటువంటి క్లిష్ట పరిస్థితుల్లో 'కిసాన్ సమ్మాన్ నిధి' ద్వారా 52 లక్షల మంది రైతులకు ప్రత్యక్ష ఆర్థిక సహాయం చేస్తున్నామని అన్నారు. తద్వారా అన్నదాతల ముఖాల్లో చిరునవ్వులు నింపడం అదృష్టంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. "బంగాల్ దేశ ఆర్థిక వ్యవస్థ దిశను నిర్ణయించేది. పారిశ్రామిక అభివృద్ధిలో అగ్రగామిగా ఉండేది. కానీ నేడు ఈ అద్భుతమైన రాష్ట్రం దీనావస్థను చూసి నా మనసు బాధపడుతోంది. 6 దశాబ్దాల బుజ్జగింపు రాజకీయాల కారణంగా బంగాల్‌కు జరిగిన కోలుకోలేని నష్టాన్ని మాటల్లో వ్యక్తపరచలేం. ఓ వైపు యువత ఉపాధి లేకపోవడం వల్ల ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లాల్సి వస్తుంది. మరోవైపు రాష్ట్రంలోని మహిళలు తమకు భద్రత లేదని భావిస్తున్నారు. స్వామి వివేకానంద, రిషి అరబిందో కలలు కన్న బంగాల్ నేడు ఓటు బ్యాంకు రాజకీయాలు, హింస, అరాచకత్వంతో నిండిపోయింది" అని మోదీ పేర్కొన్నారు.

అక్రమ చొరబాట్లు, మహిళలపై హింసతో బంగాల్ మునిగిపోయిందని మోదీ ఆరోపించారు. దేశంలోని అనేక రాష్ట్రాల్లో నేడు జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయని, పేదల ముఖాల్లో చిరునవ్వులు వికసించాయని అన్నారు. బంగాల్‌లో కూడా ఈ అభివృద్ధి, పురోగతిని తాను తీసుకొస్తానని తెలిపారు. భరతమాత ముద్దుబిడ్డలు కలలు గన్న బంగాల్‌ను పునర్నిర్మిద్దామని పిలుపునిచ్చారు. 2026 నాటికి రాష్ట్రాన్ని వికసిత్ బంగాల్‌గా మారుస్తామని ప్రమాణం చేద్దామని అన్నారు.

"మీకు సేవ చేసే అవకాశం నాకు లభిస్తే ప్రతి క్షణాన్ని మీ ముఖంలో చిరునవ్వు తీసుకురావడానికి ప్రయత్నిస్తాను. అవినీతి నుంచి ప్రజలను విముక్తి చేస్తాను. మహిళల భద్రత కోసం పాటుపడతాను. మన పిల్లలు (బంగాల్ యువత) ఉపాధి కోసం ఇతర రాష్ట్రాలకు వెళ్లాల్సిన అవసరం ఉండదు. మత హింసకు గురైన మన శరణార్థ సోదర సోదరీమణులు సీఏఏ ద్వారా పౌరసత్వం పొందుతారు" అని మోదీ స్పష్టం చేశారు.

# దేశంలో తొలి 'కౌంటర్ టెర్రరిజం పాలసీ'

# 'ప్రహార్'తో ఇక ఉగ్రవాదులకు చుక్కలే!

ఉగ్రవాదంపై ఉక్కుపాదం మోపేందుకు కేంద్ర హోం శాఖ సిద్ధమైంది. 'ప్రహార్' పేరుతో దేశంలో తొలి ఉగ్రవాద నిరోధక విధానాన్ని (కౌంటర్ టెర్రరిజం పాలసీ) తీసుకొచ్చింది. ఉగ్రవాద సవాళ్లను ఎదుర్కొనే రీతిలో ఈ పాలసీని రూపొందించారు. సీమాంతర ఉగ్రవాదం, సైబర్ దాడులు, డ్రోన్ల దుర్వినియోగం, సాంకేతిక సవాళ్లను ఎదుర్కొనేందుకు ఈ పాలసీని తీసుకొచ్చారు. ఈ మేరకు కేంద్ర హోంశాఖ సోమవారం తన వెబ్‌సైట్‌లో ప్రహార్ డాక్యుమెంట్‌ను అప్లోడ్ చేసింది.




"సీమాంతర ఉగ్రవాదంతో పాటు నేరస్థులైన హ్యాకర్లు, ఇతర దేశాలు సైబర్ దాడుల ద్వారా భారత్‌ను టార్గెట్ చేస్తున్నాయి. భారతదేశం నీరు, భూమి, గాలి ద్వారా ఉగ్రవాద ముప్పులను ఎదుర్కొంటోంది. విద్యుత్, రైల్వేలు, విమానయానం, ఓడరేవులు, రక్షణ, అంతరిక్షం, అణుశక్తితో సహా దేశ ఆర్థిక వ్యవస్థలోని కీలకమైన రంగాలను విదేశీ శక్తులు, ముష్కరుల నుంచి రక్షించే సామర్థ్యాలను అభివృద్ధి చేశాం." అని హోం శాఖ 'ప్రహార్' డాక్యుమెంట్‌లో పేర్కొంది.

### హోంశాఖ డాక్యుమెంట్‌లో కీలక విషయాలు

"ఉగ్రవాదాన్ని ఓ మతానికి, ప్రాంతానికి, నాగరికతకు భారత్ ఆపాదించబోదు. భారతదేశం అన్ని రకాల ఉగ్రవాదాన్ని ఖండిస్తుంది. నిరంతరం ఉగ్రవాద బాధితులకు అండగా నిలుస్తుంది. ప్రపంచంలో హింసకు ఎటువంటి చోటు లేదని నమ్ముతుంది. ఈ క్రమంలో జీరో టాలరెన్స్ విధానాన్ని అనుసరిస్తుంది. సరిహద్దు అవతల నుంచి చేసే స్పాన్సర్డ్ టెర్రరిజం భారత్‌పై చాలా కాలంగా ప్రభావం చూపుతోంది. జిహాదీ టెర్రర్ గ్రూపులు, వారికి సంబంధించిన సంస్థలు దేశంలో దాడులకు ప్రణాళికలు వేసి అమలు చేస్తూనే ఉన్నాయి." అని హోం శాఖ డాక్యుమెంట్‌లో వెల్లడించింది.

### 'విదేశాల నుంచి ముష్కరులు కుట్రలు'

ఆల్‌ఖైదా, ఇస్లామిక్ స్టేట్ ఆఫ్ ఇరాక్ అండ్ సిరియా (ఐఎస్ఐఎస్) వంటి టెర్రర్ గ్రూప్స్ గురించి కూడా ఈ పాలసీలో కేంద్ర హోం శాఖ ప్రస్తావించింది. ఈ టెర్రర్ గ్రూపులు స్లీపర్ సెల్స్ ద్వారా భారత్‌లో హింసను ప్రేరేపించడానికి ప్రయత్నించాయని పేర్కొంది. విదేశాల నుంచి పనిచేస్తున్న ముష్కరులు దేశంలో ఉగ్రవాదాన్ని ప్రోత్సహించడానికి కుట్రలు పన్నారని స్పష్టం చేసింది. పంజాబ్, జమ్ముకశ్మీర్ లాంటి రాష్ట్రాల్లో ఉగ్ర సంస్థలు డ్రోన్లు వాడి తమ నెట్‌వర్క్‌ను పెంచే ప్రయత్నం చేస్తున్నాయని వెల్లడించింది.

"డిజిటల్ టెక్నాలజీని టెర్రరిస్టులు వాడుతున్నారు. సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లు, ఇన్‌స్టంట్ మెసేజింగ్ అప్లికేషన్‌లు, ఎన్‌క్రిప్షన్ టూల్స్, డార్క్ వెబ్, క్రిప్టో వాలెట్‌లను ఉగ్రవాద ప్రచారం, నిధులు, కార్యాచరణ మార్గదర్శకత్వం కోసం ఉపయోగిస్తున్నారు. ముష్కరులు వాడే జదీ=చీజుణ (కెమికల్, బయోలాజికల్, రేడియోలాజికల్, న్యూక్లియర్, ఎక్స్‌ప్లోజివ్, డిజిటల్) వంటి వాటిని యాక్సెస్ చేయడం ఉగ్రవాద నిరోధక (కౌంటర్ టెర్రరిజం) ఏజెన్సీలకు ఒక సవాల్‌గా మిగిలిపోయింది. దేశం గాలి, భూమి, నీటి ద్వారా ప్రమాదాలను ఎదుర్కొంటోంది. "అని హోం శాఖ 'ప్రహార్' డాక్యుమెంట్‌లో పొందుపర్చింది.

ఉగ్రవాదాన్ని ఎదుర్కొనే విధానంలో భాగంగా కేంద్ర హోంశాఖ ఓ రోడ్‌మ్యాప్‌ను సైతం రూపొందించింది. నేరస్థులపై కేసులను బలంగా నమోదు చేసేందుకు ఎఫ్ఐఆర్ నమోదు నుంచి దర్యాప్తు జరిగే వరకు ప్రతి దశలోనూ లీగల్ నిపుణుల సలహా తీసుకోవాలని పేర్కొంది. దేశ యువతను ఉగ్ర గ్రూపులు రిక్రూట్ చేసుకుంటున్నాయని, అలాంటి వ్యక్తులపై న్యాయపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని వెల్లడించింది. తీవ్ర హింసకు పాల్పడినా, యువతను ప్రలోభ పెట్టినా ఆ తర్వాత జరిగే పరిణామాల గురించి ఎన్జీఓలు, మతపరమైన నాయకులకు వివరించనున్నట్లు తెలిపింది. భద్రతా సమస్యలను ఓ సహకార పద్ధతిలో, సాంకేతికంగా, కమ్యూనిటీ స్థాయిలో పరిష్కరించే రీతిలో సూచనలు చేస్తూ ప్రహార్ డాక్యుమెంట్‌ను తీసుకొచ్చారు.

### ప్రహార్ లక్ష్యాలు ఏంటంటే?

దేశ పౌరులను రక్షించడానికి ఉగ్రవాద దాడులను నివారించడం

కేంద్ర, రాష్ట్ర సంస్థల మధ్య సమన్వయాన్ని తేవడం

చట్టపరమైన విధానాలను పాటిస్తూ మానవ హక్కులను కాపాడడం

ఉగ్రవాదాన్ని ప్రోత్సహించే పరిస్థితులను అరికట్టడం (తగ్గించడం)

అంతర్జాతీయంగా ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడానికి ప్రపంచ భాగస్వాములతో కలిసి పనిచేయడం

# లంచం, అవినీతే సీఎం అసలైన స్నేహితులు'- స్టాలిన్‌పై విజయ్ ఫైర్

తమిళనాడు రాజకీయాల్లో ఎన్నికల వేడి పెరుగుతున్న వేళ, నటుడిగా స్టార్‌డమ్ సాధించి రాజకీయాల్లోకి అడుగుపెట్టిన విజయ్ అధికార పార్టీ డీఎంకేను ఉద్దేశించి కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్?పై తీవ్ర ఆరోపణలు గుప్పిస్తూ, ఆయన అసలైన స్నేహితులు లంచం, అవినీతి, స్వార్థ రాజకీయాలేనని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా మోసం చేస్తున్నారని మండిపడ్డారు. వెల్లూరులో నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడిన విజయ్, ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి ప్రచారం పూర్తిగా నాటకమని అన్నారు. "రాష్ట్రాన్ని సూపర్‌స్టార్ స్టేట్ చేశామని చెబుతున్నారు. కానీ ప్రజల జీవన స్థాయిలో మార్పు ఎక్కడుంది?" అంటూ ప్రశ్నించారు. తమిళనాడు గతంలో నిజమైన అభివృద్ధిని చూసిందంటే అది కామరాజ్, అన్నాదురై, ఎంజీఆర్ వంటి మహానేతల కాలంలోనేనని గుర్తుచేశారు.

### చరిత్రాత్మక ఎన్నికలుగా నిలుస్తాయంటూ!

ఆ రోజుల్లో ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగేదని, ఇప్పుడు మాత్రం ప్రచారం, రాజకీయ లాభాలే ముఖ్యమైపోయాయని విమర్శించారు. ప్రస్తుత ప్రభుత్వాన్ని ఉల్టా మోడల్ గవర్నమెంట్, స్టాండ్‌అప్ కామెడీ ప్రభుత్వం అంటూ ఎద్దేవా చేశారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికలు సాధారణ ఎన్నికలు కావని, చరిత్రాత్మక ఎన్నికలుగా నిలుస్తాయని విజయ్ పేర్కొన్నారు.



"ఈసారి అందరూ కలిసి నన్నే లక్ష్యంగా చేసుకున్నారు. అయినా ప్రజలే నా బలం" అన్నారు. అసలు పోరు తన పార్టీ తమిళగ వెట్రి కళగం (టీవీకే) డీఎంకే మధ్యేనని స్పష్టం చేశారు. "తమిళనాడు అంటే విజయ్- విజయ్ అంటే తమిళనాడు" అంటూ భావోద్వేగ వ్యాఖ్యలు చేసిన ఆయన, ప్రజల కోసం పనిచేసే ప్రభుత్వాన్ని తీసుకురావడమే తన లక్ష్యమని చెప్పారు. స్టాలిన్ ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ కాగితాలకే పరిమితమ య్యా యని, పేదల సమస్యలు అలాగే ఉన్నాయని ఆరోపించారు. టీవీకే అధికారంలోకి వస్తే రాష్ట్రంలోని ప్రతి జిల్లాకు వెళ్లి ప్రజలను స్వయంగా కలుస్తానని హామీ ఇచ్చారు. ప్రతి పౌరుడి సమస్యను వినిపించి పరిష్కారం చూపుతానన్నారు. ప్రజల ఓటు హక్కు పవిత్రమని, ఎవరూ దాన్ని లాక్కోలేరని స్పష్టం చేశారు. తమ పార్టీ ఎన్నికల గుర్తు విజల్?కు ఓటు వేయాలని కార్యకర్తలు, అభిమానులను కోరారు. "మా ఓటు, మా హక్కు" అంటూ నినాదాలు చేశారు.

### రాజకీయాల్లో ఆసక్తి

ఇదిలా ఉండగా, రాష్ట్ర రాజకీయాల్లో ప్రధానంగా అధికార డీఎంకే కూటమి, ప్రతిపక్ష అఖిల భారత అన్నా ద్రవిడ మున్నేట్ర కళగం (ఏఐఏడీఎంకే) ఆధ్వర్యంలోని ఎన్డీఏ కూటమి మధ్య పోటీ నెలకొంది. ఎన్డీఏలో భారతీయ జనతా పార్టీ కీలక పాత్ర పోషిస్తోంది. ఇక డీఎంకే కూటమిలో ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ సహా పలు పార్టీలు భాగస్వాములుగా ఉన్నాయి. ఈ రాజకీయ సమీకరణాల మధ్య విజయ్ పార్టీ టీవీకే కొత్త శక్తిగా రంగప్రవేశం చేయడం రాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. సినీ కెరీర్‌కు గుడ్‌బై చెప్పి పూర్తిస్థాయిలో రాజకీయాలపై దృష్టి పెట్టిన విజయ్, యువత మరియు అభిమానుల మద్దతుతో ముందుకు సాగుతున్నారు. ఆయన సభలకు భారీగా జనసందోహం తరలివస్తుండటం రాజకీయ వర్గాల్లో ఇపప్డు చర్చనీయాంశమవుతోంది. అధికార పార్టీపై నేరుగా దాడి చేస్తూ, ప్రజలతో భావోద్వేగ అనుబంధం పెంచుకునే ప్రయత్నం చేస్తున్నారు. మొత్తానికి, విజయ్ వ్యాఖ్యలతో తమిళనాడు రాజకీయాల్లో వేడి మరింత పెరిగింది. డీఎంకే ప్రభుత్వంపై అవినీతి ఆరోపణలు చేస్తూ, ప్రత్యామ్నాయ నాయకత్వంగా తనను ప్రజలకు పరిచయం చేసుకుంటున్నారు. రాబోయే ఎన్నికల్లో ఈ వ్యాఖ్యలు ఎంత మేర ప్రభావం చూపుతాయో, టీవీకే ఎంత వరకు ప్రభావం చూపగలదో ఎన్నికల ఫలితాలే తేల్చనున్నాయి.

ప్రతిఘటన
తెలుగు దిన పత్రిక
మంగళవారం 24 ఫిబ్రవరి 2026

# గౌరెల్లి ప్రాజెక్టు పూర్తికి ప్రభుత్వం కట్టుబడి ఉంది




**హైదరాబాద్ :** మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ పర్యావరణ అనుమతులు త్వరలోనేచట్టపరమైన అవంతారాలను అధిగమిస్తాంన్యాయపరమైన చిక్కుల పరిష్కారానికి ప్రక్రియ మొదలు పెట్టాం.భూసేకరణ ప్రక్రియ వేగవంతం చెయ్యాలిరైతులకు న్యాయపరమైన చెల్లింపులుజూన్ 2 కు ముందే భూసేకరణకు నిధులుకెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డికాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రాధాన్యత క్రమంలో నిర్మించే ప్రాజెక్టులలో గౌరెల్లి ప్రాజెక్టు ముఖ్యమైనదని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.లక్షా6 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించే లక్ష్యంతో మొదలు పెట్టిన ఈ ప్రాజెక్టు పర్యావరణ అనుమతులుతో పాటు న్యాయపరమైన చిక్కులు ఏర్పడడంతో పనులు మందగించాయన్నారు.అయితే అటువంటి అవంతారాలను అధిగమించి త్వరితగతిన పూర్తి చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన సుస్పష్టం చేశారు.సిద్ధిపేట జిల్లా అక్కనపెట మండలంలోని గౌరెల్లి గ్రామంలో నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టు పురోగతిపై సోమవారం రోజున డాక్టర్ బి.ఆర్.అంబెడ్కర్ సచివాలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ తో కలసి ఆయన ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు.రాష్ట్ర నీటిపారుదల శాఖా సలహాదారుడు ఆదిత్య దాస్ నాథ్,ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్,ఆర్ అండ్ ఆర్ కమిషనర్ శివకుమార్ నాయుడు,ఇ. ఎన్.సి జెనరల్ రమేష్ బాబు లతో పాటు కరీంనగర్, హనుమకొండ,సిద్ధిపేట జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ. వరద కాలువ ద్వారా వచ్చే నీటితో సిద్ధిపేట జిల్లా అక్కనపేట మండలం గౌరెల్లి గ్రామంలో 1.41 టి.యం.సిల నీటితో ఈ రిజర్వాయర్ నిర్మాణం ప్రతిపాదించగా అంచనాలు సవరించి 8.23 టి.యం.సి ల సామర్థ్యానికి పెంచి అదనపు ఆయాకట్టు సేద్యంలోకి తేవాలి అన్నది రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించి సవరించిన ప్రతిపాదనలు ప్రభుత్వం ముందు పెట్టమన్నారు.అయితే అదే సమయంలో భూసేకరణ విషయంలో రైతులకు అందించే చెల్లింపులు న్యాయబద్ధంగా ఉండడంతో పాటు సకాలంలో నిధుల మంజూరుకు ప్రభుత్వం సన్నద్ధంగా ఉందని ఆయన వెల్లడించారు.గౌరెల్లి ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణకు అవసరమైన నిధులను జూన్ 2 ముందే విడుదల చేస్తామని అందుకు సంబంధించిన ప్రక్రియను సకాలంలో పూర్తి చేయలని ఆయన కరీంనగర్, హనుమకొండ, సిద్దిపేట జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు.న్యాయపరమైన అంశాలను ఎదుర్కొంటున్న గౌరెల్లి ప్రాజెక్టుకు సంబంధించిన కేసు మరో రెండు రోజుల్లో విచారణకు రానున్న సందర్భంలో చిక్కులను అధిగమించెందుకు అవసరమైన వ్యూహం తో సిద్ధంగా ఉండాలని సమీక్షలో పాల్గొన్న అడ్వకేట్ జెనరల్ ను ఆయన ఆదేశించారు.అనేక ఆవాంతరాలతో అర్ధాంతరంగా నిలిచి పోయిన గౌరెల్లి ప్రాజెక్టును పూర్తి చేసేందుకు అన్నివైపులా అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని ఆయన పేర్కొన్నారు.ఇక పై నిధుల కేటాయింపులలో కుడా ఎటువంటి అలసత్వానికి అవకాశం లేకుండా ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటు త్వరితగతిన పూర్తి చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు.ఇదే సమీక్షలో పాల్గొన్న మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ. గౌరెల్లి ప్రాజెక్టు పూర్తి చేసేందుకు నిరంతరం ఒత్తిడి పెంచుతున్నామని అందుకు సంబంధించిన భూసేకరణను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి నిర్దేశించిన రీతిలో దేవాదుల,గౌరెల్లి తో సహా నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణను పూర్తి చేయాలన్నారు.పట్టణీకరణ వేగవంతంగా పెరుగుతున్న నేపద్యంలో భూముల ధరలు పెరగడంతో రైతులు పెద్ద మొత్తంలో నష్టపరిహారం కోరుకుంటున్నారని అందుకు సంబంధించిన విధాన నిర్ణయాలు న్యాయపరంగా తీసుకోవాలని సూచించారు.గౌరెల్లి ప్రాజెక్టు పనులు వేగవంతం చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నీటిపారుదల శాఖా సలహాదారు ఆదిత్య దాస్ నాథ్ కు సూచించారు.

# రాజ్యసభ ఎన్నికల బరిలో బీఆర్ఎస్ పార్టీ మారిన ఎమ్మెల్యేలే టార్గెటా ?



**హైదరాబాద్ :** తెలంగాణలో వచ్చే ఏప్రిల్ 9వ తేదీతో ఇద్దరు రాజ్య సభ సభ్యుల టర్మ్ ముగుస్తుంది. బిఆర్ఎస్ రాజ్యసభ ఫ్లోర్ లీడర్ కె.ఆర్.సురేష్ రెడ్డి, కాంగ్రెస్ రాజ్యసభ ఎంపీ అభిషేక్ సింగ్వీల పదవీకాలం ముగుస్తోంఇ. దీంతో ఇప్పటికే కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యుల్ రిలీజ్ చేసింది. అయితే రాజ్యసభ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ పోటీ చేస్తుందా లేదా అనే చర్చ పొలిటికల్ సర్కిల్స్ లో జరుగుతోంది.ఇక సంఖ్యా బలం ప్రకారం రెండు రాజ్యసభ స్థానాలు కాంగ్రెస్ పార్టీకి దక్కే అవకాశం ఉంది.ఒక వేళ పోటీ చేయాలని అనుకుంటే గులాబీ పార్టీ వ్యూహం ఎలా ఉంటుంది అనేది ఆసక్తికరంగా మారింది. ప్రస్తుతం తెలంగాణ అసెంబ్లీలో ఉన్న సంఖ్యా బలం ప్రకారం ఒక్కో రాజ్యసభ సీటుకు 41 మంది ఎమ్మెల్యేల ఓట్లు కావాలి. అయితే బీజేపీకి చెందిన 8 మంది ఎమ్మెల్యేలు ఓటింగ్ కు దూరంగా ఉంటే ఒక్కో రాజ్యసభ సీటుకు 38 మంది ఎమ్మెల్యేల మద్దతు అవసరం అనే ఈక్వేషన్స్ తెరపైకి వచాయు.ఇక అధికార కాంగ్రెస్ పార్టీకి 66 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. సీపీఐ ఎమ్మెల్యే ఒకరు,ఎంఐఎంకు చెందిన ఏడుగురు ఎమ్మెల్యేలు మద్దతు తెలిపితే హస్తం పార్టీ బలం 74 కు చేరుతుంది.దీంతో నేరుగా రెండు రాజ్యసభ స్థానాలను గెలుచుకోవాలంటే ఇంకో ఇద్దరు ఎమ్మెల్యేల ఓట్లు కాంగ్రెస్ పార్టీకి పడాలి. లేకపోతే రెండవ ప్రాధాన్యత ఓట్లను లెక్కించాల్సి ఉంటుంది. ఒక వేళ రాజ్యసభ ఎన్నికలు జరిగితే బిఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్ పార్టీలో చేరిన పది మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ అభ్యర్థులకు సెకండ్ ప్రయారిటీ ఓటు వేస్తారా అనే దానిపై సస్పెన్స్ నెలకొంది. బిఆర్ఎస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో 39 స్థానాలను గెలిచింది.ఇద్దరు ఎమ్మెల్యేలు మరణించారు. ఉప ఎన్నికల్లో రెండు స్థానాల్లో కాంగ్రెస్ గెలిచింది.ఆ తర్వాత పది మంది ఎమ్మెల్యేలు బిఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరారు. దీంతో బిఆర్ఎస్ బలం 27 కు చేరింది ఇక పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి కాంగ్రెస్ పార్టీపై అసంతృప్తితో ఉన్నారు. మరోవైపు పది మంది ఎమ్మెల్యేలపై బిఆర్ఎస్ సుప్రీంకోర్టులో అనర్హత పిటీషన్ వేసింది.స్పీకర్ విచారణ చేపట్టి ఏడుగురు ఎమ్మెల్యేలకు క్లిన్ చిట్ ఇచ్చారు. మరో ముగ్గురు ఎమ్మెల్యేలపై తన నిర్ణయాన్ని ప్రకటించాల్సి ఉంది. దీంతో పార్టీ మారిన ఎమ్మెల్యేలను ఇరుకున పెట్టే విధంగా రాజ్యసభ ఎన్నికల్లో బిఆర్ఎస్ తమ అభ్యర్థిని పోటీలో పెట్టే అవకాశం లేకపోలేదని తెలుస్తోంది. రాజ్యసభ ఎన్నికల్లో బిఆర్ఎస్ తమ అభ్యర్థిని బరిలోకి దింపితే పార్టీ తరపున విప్ జారీ చేయాల్సి ఉంటుంది.కానీ ఒకవేళ విప్ ను ధిక్కరించినా ఆ ఎమ్మెల్యేపై వేటు పడే అవకాశం లేదు. కానీ పార్టీ తరపున రాజ్యసభ ఎన్నికల పోలింగ్ ఏజెంట్ కు చూపించి ఎమ్మెల్యేలు తమ ఓటు వేయాల్సి ఉంటుంది.దీంతో పార్టీ మారిన ఎమ్మెల్యేలు ఎవరికి ఓటు వేశారో గులాబీ పార్టీ తెలుసుకునే అవకాశం ఉంటుంది.ఎమ్మెల్యేలపై వేటు వేయాలని డిమాండ్ చేస్తున్న బిఆర్ఎస్ ఈ అంశాన్ని న్యాయస్థానాల్లో వాడుకోవచ్చని గులాబీ పార్టీ భావిస్తోంది. ఇక విప్ జారీ చేస్తారు. కాబట్టి పార్టీ మారిన ఎమ్మెల్యేలు రాజ్యసభ ఎన్నికల ఓటింగ్ లో పాల్గొనాల్సి ఉంటుంది. మొత్తానికి రాజ్యసభ ఎన్నికల్లో గులాబీ పార్టీ తరపున అభ్యర్థిని కేసీఆర్ పోటీలో ఉంచుతారా లేదా అనేది చూడాలి.

# ఎవరికో ఈ సీటు?



-మొదటిపేజీ తరువాయి

మెజారిటీ ఉన్నట్లు కాంగ్రెస్ చెబుతోంది. ఒక సీటు ఏఐసీసీ కోటా కింద వెళ్లే అవకాశం ఉండగా, మరొకటి రాష్ట్ర ప్రాధాన్యత కింద నిర్ణయమయ్యే అవకాశం కనిపిస్తోంది. జాతీయ అవసరాలు ఒక వైపు, రాష్ట్ర సమీకరణాలు మరో వైపు. ఇప్పుడు అందరినీ తొలిచే ప్రశ్న ఒక్కటే. పార్టీ ఎవరికి అవకాశం ఇస్తుంది? సీనియార్టీకా? విధేయతకా? లేక పార్టీ అవసరాలకా? రాజ్యసభ సీట్ల భర్తీ కోసం ఏ ప్రమాణాలు తీసుకుంటారు అన్న చర్చ పార్టీలో కొనసాగుతోంది. రాష్ట్ర శాసనసభలో మొత్తం 119 మంది సభ్యులు ఉన్నారు. ఒక రాజ్యసభ సీటు గెలవాలంటే 40 మంది ఎమ్మెల్యేల మద్దతు అవసరం. కాంగ్రెస్‌కు తగిన సంఖ్యాబలం ఉంది. రెండు సీట్లు సులభంగా గెలుచుకునే పరిస్థితి ఉంది. ఈ రెండు సీట్ల కోసం పెద్ద సంఖ్యలో నేతలు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇటీవల రాజ్యసభ నుంచి రిటైర్ అయిన అభిషేక్ మను సింఘ్వీ, తిరిగి తనకు రెన్యువల్ చేయాలని కోరుతున్నట్లు తెలుస్తోంది. రేసులో ప్రముఖులు : అదేవిధంగా జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డి, మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్, షబ్బీర్? అలీ, మాజీ పీసీసీ అధ్యక్షుడు హనుమంతరావు, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్, మాజీ మంత్రి చిన్నారెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఇరావత్రి అనిల్ కుమార్, పీసీసీ క్రమశిక్షణ కమిటీ కన్వీనర్, సీనియర్ నాయకులు శ్యామ్ మోహన్ తదితరులు రేసులో ఉన్నారు. ఇటీవల పదవీ విరమణ పొందిన అభిషేక్ సింఘ్వీ సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది. పార్లమెంట్‌లో పార్టీ వాణిని బలంగా వినిపించే సామర్థ్యం ఆయనకు ఉందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. రెండో సీటు రాష్ట్ర సమీకరణాలపై ఆధారపడే అవకాశం ఉంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, రాష్ట్ర వ్యవహారాల ఇంఛార్జి మీనాక్షి నటరాజన్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తదితరులు కలిసి నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ప్రాంతీయ సమతౌల్యం, కుల సమీకరణాలు ముఖ్యంగా పార్టీ భావిస్తోంది. కష్టకాలంలో పార్టీ కోసం పని చేసిన వారిని సైతం గుర్తు పెట్టుకోవాలి అన్న అభిప్రాయం ఉంది. అసంతృప్తి పెరిగే అవకాశం : ఈసారి సామాజిక సమతౌల్యం ప్రధాన అంశంగా మారింది. రెడ్డినా? బీసీనా? మైనార్టీనా? ఎస్సీనా? ఎస్టీనా? ఎవరికి ప్రాధాన్యత ఇస్తారు అన్న ఉత్కంఠ నెలకొంది. రెండు సీట్లు రెండు వర్గాలకు వెళ్లే అవకాశం ఉందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. టికెట్ రాకపోతే అసంతృప్తి పెరిగే అవకాశం ఉన్నందున పార్టీ అధిష్ఠానం, రాష్ట్ర నాయకత్వం సమన్వయం కీలకంగా మారింది. రాజ్యసభ సీట్లపై చివరి నిమిషం వరకు ఉత్కంఠ కొనసాగనుంది.

## వివక్ష సమస్య ఎక్కడ ఎదురైనా రాహుల్ గాంధీ అక్కడ ప్రత్యక్షం అవుతారు

-మొదటిపేజీ తరువాయి

ఆ సమయంలో కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలను ఎవరిని కూడా యూనివర్సిటీలోకి రానివ్వలేదు అంటరానితనం సమస్యను సమస్యగా చూడాలి తప్ప రాజకీయ జోక్యం ఉండకూడదు అన్నది ఆయన ఆలోచన అని వివరించారు. ఆయన ఆలోచన మేరకు కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో రోహిత్ వేముల చట్టం తెచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని వివరించారు. ఈ రాష్ట్రంలో అధికారంలోకి వస్తాం రాగానే వనరులు సంపద సమానంగా పంచుతామని ఎన్నికల ముందు రాహుల్ గాంధీ ప్రకటించారు ఆయన ప్రకటించినట్టుగా అధికారంలోకి రాగానే ప్రజా ప్రభుత్వం ఆధ్వర్యంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు. దేశ స్వాతంత్రం అనంతరం ఎక్కడా జరగని కుల గణనను ప్రజా ప్రభుత్వం 50 రోజుల్లో పూర్తి చేసి శాసనసభలో ప్రవేశపెట్టి ఏకగ్రీవంగా ఆమోదం పొందాలని వివరించారు. దేశానికి స్వాతంత్రం సాధించడంతోపాటు ఆర్థిక, సామాజిక, రాజకీయ సమానత్వం సాధించేందుకు అనేక విప్లవాత్మక చట్టాలు చేసిన కాంగ్రెస్ పార్టీని కనుమరుగు చేసేందుకు బిజెపి కుట్రలు చేస్తుందని తెలిపారు. స్వాతంత్రం ముందు నుంచి దేశంలోని రుగ్మతల పరిష్కారం కోసం ఉద్యమిస్తున్న కాంగ్రెస్ పార్టీని దేశంలో లేకుండా చేసేందుకు బిజెపి కాంగ్రెస్ ముక్తభారత్ చేస్తాం, రాజ్యాంగాన్ని మారుస్తాం అంటుంది అన్నారు. ఈ సమాజం సామాజికంగా, ఆర్థికంగా విభజన జరిగి ఇలాగే ఉండాలని కొన్ని రాజకీయ పార్టీలు కోరుకుంటున్నాయని తెలిపారు. కులం అనేది భారతదేశంలో ఒక వాస్తవం, తాను కుల వివక్షణ ఎదుర్కొన్నానని వివరించారు. ఈ సమాజంలో కుల వివక్ష ఉంటుంది అన్న వాస్తవాన్ని మదిలో పెట్టుకుని బలమైన సంకల్పంతో అనుకున్న లక్ష్య సాధనకు ముందుకు పోతున్న క్రమంలో వివక్ష ఎదురైన అది మన లక్ష్యాలను దెబ్బతీయలేదని వివరించారు. అఖిలభారత కాంగ్రెస్ కమిటీ ఒక రాజకీయ పార్టీగా మాత్రమే కాదు దేశంలో అంటరానితనం, బాల్య వివాహం, వితంతు వివాహం వంటి అనేక రుగ్మతలపై దశాబ్దాలుగా ప్రజలను చైతన్యం చేస్తూ ముందుకు పోతుందని తెలిపారు. దేశ స్వాతంత్ర సంగ్రామం ఒకవైపు, సామాజిక అంశాలపై ఆందోళనలో మరోవైపు ఈ దేశంలో రెండు అంశాలను అఖిల భారత కాంగ్రెస్ కమిటీ సమాంతరంగా ముందుకు తీసుకువెళ్లిందని వివరించారు. కాకినాడలో జరిగిన అఖిల భారత కాంగ్రెస్ కమిటీ సమావేశంలో అంటరానితనం పూర్తిగా నిర్మూలించాలని, దేవాలయాల్లో అందరికీ ప్రవేశం కల్పించాలని ఎఐ మాధవన్ తీర్మానం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. కేరళలో వైకాం సత్యాగ్రహ, మహారాష్ట్రలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆధ్వర్యంలో చౌదర్ సత్యాగ్రహం వంటి కార్యక్రమాలను అఖిలభారత కాంగ్రెస్ కమిటీ చేపట్టింది అన్నారు. గాంధీజీ ఆధ్వర్యంలో హరిజనోద్ధరణ పేరిట పెద్ద యాత్ర చేపట్టారని దళితుల దేవాలయల ప్రవేశం, దళిత వాడల్లో పారిశుద్ధ్యం వంటి కార్యక్రమాలు ఈ దేశంలో అంటరానితనాన్ని తొలగిస్తారని గాంధీ ఓ నమ్మకాన్ని ఏర్పరిచారని తెలిపారు. స్వాతంత్రం వచ్చిన తర్వాత ప్రధాని నెహ్రూ, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆధ్వర్యంలో దేశంలో అంటరాని తనం నిర్మూలనకు 1049లో ఆర్టికల్ 17 ద్వారా అవకాశం కల్పించారని తెలిపారు. ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని తీసుకురావడం, ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ ను పూర్తిగా అమలు చేయడం కాంగ్రెస్ ప్రభుత్వాల ద్వారానే సాధ్యమైంది అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన భూ సంస్కరణలు, బ్యాంకుల జాతీయ కరణ ద్వారా ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన వర్గాలకు ఆర్థిక స్వాతంత్రం లభించిందని తద్వారా సామాజిక వివక్షను ఎదుర్కొనేందుకు చేయూత లభించిందని డిప్యూటీ సీఎం వివరించారు. సమావేశంలో పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, డాక్టర్ వంశీ చందర్ రెడ్డి, ఏ ఐ సి సి నాయకులు విశ్వనాథన్, సావంత్, సచిన్ రావు తదితరులు పాల్గొన్నారు.

## గ్లోబల్ వాల్యూ క్రియేషన్ హబ్ గా 'హైదరాబాద్'

-మొదటిపేజీ తరువాయి

అంతర్జాతీయ బీమా దిగ్గజం హార్ట్ ఫోర్డ్ 1.5 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో 1200 మంది ఉద్యోగుల సామర్థ్యంతో ఏర్పాటు చేసిన 'ది హార్ట్ ఫోర్డ్ ఇండియా టెక్నాలజీ సెంటర్'ను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... అంతర్జాతీయ విస్తరణలో భాగంగా రెండు శతాబ్దాల ఘన చరిత్ర కలిగిన హార్ట్ ఫోర్ట్ హైదరాబాద్ ను ఎంపిక చేసుకోవడం ఇక్కడి ప్రతిభకు, డిజిటల్ ఇంజనీరింగ్‌లో మన నాయకత్వానికి దక్కిన గుర్తింపుగా భావిస్తున్నామన్నారు. ఈ కేంద్రం ద్వారా ఏఐ, రిస్క్ ఇంటెలిజెన్స్‌తో కూడిన ఆధునిక బీమా రంగంలో హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ మరింత పెరుగుతుందన్నారు. నగరంలో ఇప్పటికే 400కు పైగా గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు(జీసీసీ) సేవలు అందిస్తున్నాయన్నారు. ఈ జాబితాలో మారియట్, మెక్‌డొనాల్డ్స్, యూబీఎస్, డాజన్, వాన్‌గార్డ్, ఎలీ లిల్లీ, హెచ్ సీఏ హెల్త్ కేర్, సిటిజన్స్ బ్యాంక్ లాంటి దిగ్గజ సంస్థలు ఈ జాబితాలో ఉన్నాయన్నారు. వీటిని కేవలం బ్యాక్ ఎండ్ ఆపరేషన్స్‌కు మాత్రమే పరిమితం చేయకుండా... గ్లోబల్ వాల్యూ సెంటర్లుగా మార్చేలా అవసరమైన వ్యూహాత్మక ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నామన్నారు. పారదర్శక పాలన, సమర్థవంతమైన నాయకత్వం, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో సంస్కరణలు, ఆధునిక డిజిటల్‌ఇన్ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధి తదితర అంశాలు హార్ట్ ఫోర్డ్ లాంటి అంతర్జాతీయ దిగ్గజ సంస్థలు తెలంగాణను తమ గమ్యస్థానంగా ఎంచుకునేందుకు దోహదపడుతున్నాయన్నారు. తాజాగా ప్రారంభించిన ఈ కార్యాలయం యూఎస్ లోని హార్ట్ ఫోర్డ్, చికాగో, షార్లెట్, కొలంబస్ లో ఉన్న టెక్నాలజీ కేంద్రాలకు అనుబంధంగా పని చేస్తూ... ఏఐ, డిజిటల్ ట్రాన్స్ఫర్మేషన్, అడ్వాన్స్డ్ టెక్నాలజీ డెవలప్ మెంట్ పై దృష్టి సారిస్తూ 'ఇంజనీరింగ్ ఎక్స్ లెన్స్ హబ్ ' గా పని చేస్తుందని మంత్రి శ్రీధర్ బాబు వివరించారు. కార్యక్రమంలో హార్ట్ ఫోర్డ్ ప్రెసిడెంట్ మోరిస్ టూకర్, చీఫ్ మార్కెటింగ్ అండ్ కమ్యూనికేషన్స్ ఆఫీసర్ క్లైర్ బర్న్స్, సీఐవో శేఖర్ పన్నాల, హార్ట్ ఫోర్డ్ ఇండియా ఎండీ అండ్ హెడ్ సూర్య తమ్మిరాజు, సీటీవో ఇమ్రాన్ మాలిక్ తదితరులు పాల్గొన్నారు.

## 2027లో జనగణన ప్రక్రియ

-మొదటిపేజీ తరువాయి

ఫిబ్రవరిలో చేపడతారు. నిర్ణిత షెడ్యూల్ ప్రకారం తొలి విడత జరిగే ఇండ్ల గణన (హౌజ్ లిస్టింగ్ ఆపరేషన్) రాష్ట్రంలో మే 11వ తేదీన ప్రారంభించి జూన్ 9 వరకు చేపట్టేందుకు ఏర్పాట్లు చేసినట్లు చీఫ్ సెక్రెటరీ రామకృష్ణరావు వివరించారు. హౌజ్ లిస్టింగ్?కు కేంద్రం నిర్దేశించిన 34 ప్రశ్నల నమూనాను వివరించారు. రాష్ట్రంలో ఎన్యుమరేటర్లతో పాటు నోడల్ ఆఫీసర్లు మొత్తం 89 వేల మంది ఉద్యోగులు జన గణన ప్రక్రియలో పాలుపంచుకుంటారు. భూసేకరణ, భూముల కేటాయింపులు, ఉద్యోగాల భర్తీ, రైతు భరోసా నిధుల విడుదలపై కూడా కేబినెట్ నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. 5 సాగునీటి ప్రాజెక్టులకు సవరించిన అంచనాలపై చర్చిస్తున్నట్లు తెలుస్తోంది. ఉద్యోగుల ఆరోగ్య పథకం, యంగ్ ఇండియా స్కూళ్లకు భూముల కేటాయింపుపై, ధాన్యం సేకరణపైనా కేబినెట్‌లో చర్చించనున్నట్లు సమాచారం.

## కాంగ్రెస్‌కు శాపంగా మారుతున్న మజ్లీస్

**హైదరాబాద్ :** తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల ఫలితాలతో కాంగ్రెస్ పార్టీ జోష్ మీదుంది. మున్సిపల్ ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత స్వయంగా పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే, అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలు ట్విట్టర్ ద్వారా అభినందనలు తెలిపారు. అంతేకాదు తెలంగాణ ముఖ్యనేతలందరినీ ఢిల్లీకి పిలుపించుకుంది హైకమాండ్. రాష్ట్ర మంత్రులందరితో కలిసి సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ పార్టీ జాతీయ నాయకత్వాన్ని కలిశారు. ఈ సందర్భంగా తెలంగాణ ముఖ్యనేతలతో రాహుల్ గాంధీ చేసిన కామెంట్స్ ఇప్పుడు పొలిటికల్ సర్కిల్స్‌లో చర్చనీయాంశంగా మారాయి.రాష్ట్ర ప్రభుత్వ పనితీరును అభినందిస్తూనే.. కొన్ని హెచ్చరికలు జారీ చేశారట. ముఖ్యంగా పొలిటికల్‌గా వేసే అడుగుల విషయంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారట. మరీ ముఖ్యంగా ఎంఐఎం విషయంలో కేర్ ఫుల్‌గా ఉండాలని చెప్పారట. ఆల్ ఆఫ్ సడెన్‌గా రాహుల్ గాంధీ ఈ కామెంట్స్ చేసే సరికి తెలంగాణ రాష్ట్ర నేతల నోట మాట రాలేదట. ఈ సందర్భంగా ఒకరిద్దరు మంత్రులు కలుగజేసుకొని..సర్..స్థానిక పరిస్థితులకు అనుగుణంగా ముందుకు వెళ్లాల్సి వస్తుందని వివరించబోయారట. వెంటనే పార్టీ ఏఐసీసీ చీఫ్ ఖర్గే కలుగజేసుకొని.. మేము చెప్పేది అర్థం చేసుకోండి..అయినా ఈ విషయంపై తర్వాత మరోసారి వివరంగా చర్చిద్దామంటూ విషయాన్ని అంతటితో క్లోజ్ చేశారట.ఎంఐఎం విషయంలో రాహుల్ పర్టిక్యులర్‌గా మాట్లాడే సరికి తెలంగాణ నేతలు ఒక్కసారిగా సైలెంట్ అయిపోయారట. తెలంగాణలో చాలా చోట్ల దాదాపు 30 నుంచి 40 నియోజకవర్గాల్లో ముస్లిం ఓటర్లు డిసైడింగ్ ఫ్యాక్టర్‌గా ఉన్నారు. దీంతో ముస్లిం వర్గాన్ని పోలరైజ్ చేయగలిగిన ఎంఐఎంతో ఫ్రెండ్లీగా ఉంటే.. పొలిటికల్‌గా కలిసి వస్తుందనేది తెలంగాణ కాంగ్రెస్ నేతల ఆలోచనగా ఉంది.

## సంపాదకీయం

# ఉక్రెయిన్‌పై రష్యా దండయాత్రకు నాలుగేళ్లు

ప్రారంభమైన ఉక్రెయిన్‌పై రష్యా దాడులు పూర్తి యుద్ధంగా మారి నాలుగేళ్లు దాటుతున్న వేళ, ఈ యుద్ధ మారణహోమానికి ముగింపే కనిపించడం లేదు. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత ఐరోపాలో అతి పెద్ద సైనిక సంఘర్షణగా నిలుస్తున్నది. తీవ్ర ఆస్తి, ప్రాణ నష్టాలతో పాటు మిలియన్ల మంది స్థానభ్రంశం, మౌళిక సదుపాయాల విధ్వంసాలు నమోదు కావడం విచారకరం. ఉక్రెయిన్ అద్భుత ధైర్యసాహసాలతో, పాశ్చాత్య దేశాల మద్దతుతో రష్యా దాడులను సమర్ధవంతంగా తిప్పికొడుతూ "స్టీల్ పోర్కుపైన్" రక్షణను కొనసాగిస్తున్నది. వేలాది మంది ప్రాణాలు కోల్పోవడం, మిలియన్ల కొద్దీ ప్రజలు శరణార్థులుగా మారడంతో ఒక తరం తీవ్ర మానసిక ఆందోళనకు గురిచేసింది. రష్యా బలగాలు ఉక్రెయిన్‌లోకి కీలక మౌళిక వనరులు, పవర్ గ్రిడ్‌లను లక్ష్యంగా చేసుకొని "ఇంధన ఉగ్రవాదం (ఎనర్జీ టెర్రరిజమ్)" మార్గాలను అనుసరిస్తున్నది. ఉక్రెయిన్ ప్రాంతాలను స్వాధీనం చేసుకోవడానికి రష్యా, తన సార్వభౌమాధికారాన్ని కాపడుకోవ డానికి యుద్ధాన్ని కొనసాగిస్తున్నాయి. ఈ యుద్ధం వల్ల ప్రపంచవ్యాప్తంగా ఇంధన సరఫరా, ఆహార భద్రత, దౌత్య సంబంధాలను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నది. ఉక్రెయిన్ తన ప్రాదేశిక సమగ్రతను కాపాడకపోవడానికి, అంతర్జాత చట్టాల ప్రకారం శాంతిని కోరుకుంటూ, రష్యా దాడులకు బదులు ఇస్తున్నది. గత 27 మాసాలుగా ఇజ్రాయిల్-పాలస్తీనా యుద్ధం కాల్పుల విరమణ, యుద్ధ ముగింపుకు అంగీకారం కుదిరినట్లే కుదిరి తిరిగి ఆయుధాల మంటలు ఎగిసిపడడం కొనసాగుతోంది. ఉక్రెయిన్‌పై రష్యా దాడిలో అపార ఆస్తి, ప్రాణ నష్టాలు: ఉక్రెయిన్ - రష్యా యుద్ధంలో ఇరు పక్షాలకు చెందిన లక్షల మంది సైనికులు, సాధారణ పౌరులు ప్రాణాలు కోల్పోగా, మిలియన్ల కొద్దీ గాయపడడం, పది మిలియన్లకు పైగా ఉక్రెనియన్లు నిర్వాసితులుగా మారి శరణార్థి శిబిరాల్లో అమానవీయ దుస్థితుల్లో ప్రాణాలను బిగబట్టి ఊపిరి పీల్చుకుంటున్నారు. వివిధ అంచనాల ప్రకారం ఇప్పటి వరకు లక్ష వరకు ఉక్రెనియన్ బలగాలు చనిపోగా, 4 లక్షలకు పైగా గాయపడ్డారు. అదే విధంగా కనీసం 12.25 లక్షల రష్యా బలగాలు ప్రాణాలను కోల్పోవడం లేదా గాయపడడం జరిగినట్లు తెలుస్తున్నది. రష్యా ఆక్రమించిన భూభాగాన్ని వెనక్కి తీసుకోవడానికి ఉక్రెయిన్, ఉక్రెయిన్‌ను ఆక్రమించాలని రష్యా తమ తమ పోరాటాలను ఉధృతంగా చేస్తున్నాయి. నేడు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ యుద్ధ విరమణకు చేసిన ప్రయత్నాలు పని చేయలేదు. నేటికి ఉక్రెయిన్ దాదాపు 6 లక్షల వరకు మరణించి లేదా గాయపడి ఉంటారని తెలుస్తున్నది. ఉక్రెయిన్ : రష్యా పక్షాల మరణాలు/గాయపడిన వారి నిష్పత్తి 1 : 2.5 ఉండవచ్చని తెలుస్తున్నది. నాలుగేళ్లుగా కొనసాగుతున్న యుద్ధానికి ముగింపు కనబడడం లేదు. రష్యా ఏకపక్షంగా విలీనం చేసుకున్న నాలుగు ఉక్రెయిన్ భూభాగాలను తిరిగి ఉక్రెయిన్‌కు ఇవ్వడం జరగదని రష్యా పట్టుపడుతోంది. ఇప్పటికే ఉక్రెయిన్‌కు చెందిన 18 శాతం భూభాగం రష్యన్ నియంత్రణలోకి వెళ్లింది. ఏకపక్షంగా ఉక్రెయిన్ బలహీన దేశమంటూ రష్యా చేసిన దండయాత్రతో పుతిన్ భారీ మూల్యం చెల్లిస్తున్నారు. ఉక్రెయిన్ నాటో కూటమిలో చేరకూడదని, రష్యా రసరిహద్దుల వరకు నాటో కూటమి విస్తరణ జరగడం తమ భద్రతకు ప్రతికూలమని పుతిన్ వాదిస్తున్నారు. ఉక్తెయిన్ ఒక స్వతంత్ర దేశమే కాదని రష్యా విచిత్రంగా వాదిస్తోంది. ఉక్రెయిన్ గత చరిత్ర - యుద్ధం ప్రారంభం: 1700ల్లో రష్యా సామ్రాజ్య పాలనలో ఉన్న ఉక్రెయిన్ 1917లో రష్యా ఉద్యమంతో రష్యా సామ్రాజ్య పాలన నుంచి విముక్తమై 1922లో సోవియట్ యూనియన్‌లో భాగమై పోయింది. 1930ల్లో మిలియన్ల ఉక్తెనియన్లు కరువుకాటకాలతో ప్రాణాలను కూడా కోల్పోవడం జరిగింది. 1991లో సోవియట్ యూనియన్ విచ్ఛిన్నం కావడంతో మరో సారి ఉక్రెయిన్ స్వతంత్ర దేశంగా నిలబడింది. 2014లో క్రిమియాను రష్యా ఆక్రమించడం, ఉక్తెయిన్ వేర్పాటువాదులకు రష్యా మద్దతు ఇవ్వడం కూడా ఉక్రెయిన్ కోపానికి కారణం అయ్యింది. నాటో తన దేశాన్ని ఆక్రమించారని చూస్తున్నదని రష్యా, రష్యా నుంచి తమ దేశ ప్రాంతాలకు ప్రమాదం ఏర్పడుతున్నదని ఉక్రెయిన్ భావించడంతో యుద్ధ విరమణ దిశగా అడుగులు పడడం లేదు. ఈ వ్యాసం రాస్తున్న సమయంలో కూడా రెండు దేశాల మధ్య భీకర సాయుధ పోరు కొనసాగుతూనే ఉన్నది. రష్యాలోని మెజారిటీ ప్రజలే కాకుండా పుతిన్ లాంటి నాయకులు కూడా ఉక్రెయిన్ తమ దేశంలో భాగమే అని భావించడంతో రెండు దేశాల మధ్య విభేదాలు రోజు రోజుకు పెరగడం, చివరకు 24 ఫిబ్రవరి 2022న రష్యా పూర్తి స్థాయి దాడి చేయడంతో యుద్ధం అనివార్యం అయ్యింది. 2019లో ఉక్రెయిన్ అధ్యక్షుడిగా ఎన్నిక కావడంతో పాటు అమెరికా, యూరోప్ దేశాల సహకారంతో యుద్ధం మారణహోమంగా మారింది. రష్యా పక్షాన చైనా, ఇరాన్, ఉత్తర కొరియాలు నిలవడంతో నువ్వా నేనా అనే రీతిలో మారణహోమం కొనసాగుతున్నది. సమీపంలో కానరాని యుద్ధ విరమణ ఆలోచనలు: నేడు ఉక్రెయిన్-రష్యా యుద్ధం కాల్పుల విరమణ లేదా ముగింపుకు రావాలంటే ఇరు పక్షాలను ఒక టేబుల్‌పై చర్చలకు కూర్చోబెట్టాల్సి ఉంది. ఇది చాలా కష్టసాధ్యమని ప్రస్తుత పరిస్థితులు స్పష్టం చేస్తున్నాయి. ఈ యుద్ధానికి చరమగీతం పాడడానికి నాలుగు మార్గాలు కనిపిస్తున్నట్లు విశ్లేషిస్తున్నారు. వీటిలో యుద్ధం దీర్ఘకాలం కొనసాగడం, యుద్ధ తీవ్రత తగ్గడం, యూఎస్ యూరోప్‌ల సహకారంతో ఉక్రెయిన్ గెలవడం, లేదా రష్యా గెలుపు బాటన నిలవడం లాంటి పరిష్కార మార్గాలు కనిపిస్తున్నాయి. డొనాల్డ్ ట్రంప్ కూడా యుద్ధ ముగింపును కోరుతున్నప్పటికీ రష్యా ఆధిపత్యాన్ని అంగీకరించడం అసాధ్యమే. యూఎస్, యూరోప్‌ల మిలటరీ, ఆర్థిక సహకారంతో మాత్రమే ఉక్రెయిన్ పై చేయి సాధించగలదు. కాల్పుల విరమణ లేదా యుద్ధ విరమణ చర్చలకు ఉక్రెయిన్ అంగీకరిస్తున్నప్పటికీ ఈ ప్రతిపాదనలను రష్యా వ్యతిరేకిస్తున్నది. ఎవరు పట్టు వారిది. యుద్ధ భూమిలో పోతున్న ప్రాణాలు ఇరువురివి. ఇరు దేశాలు పౌర సంక్షోభాలను ఎదుర్కొంటున్నాయి. దౌత్యపరమైన ప్రతిపాదనలు ఆదిలోనే తుంచబడుతున్నాయి. జెలెన్స్కీ, పుతిన్‌లు మంకు పట్టు పట్టుకొని మారణహోమం కొనసాగిస్తున్నారు. మరణాల లెక్కలను సవరించుకుంటున్నారు. ఆకలి కేకలను మించి యుద్ధ మోతలు మోగిస్తున్నారు. రష్యా గెలుపు పశ్చిమ దేశాలకు ఓటమితో సమానం. ఉక్రెయిన్ గెలుపు రష్యా-చైనాలకు తల వంపులు అవుతున్నది. యుద్ధం దీర్ఘకాలం కొనసాగితే మారణహోమ మరుభూమి తప్ప అభివృద్ధి ఆనందాలు కనిపించవు. యుద్ధం కొనసాగితే ఇరు దేశాల ప్రజలే కాకుండా ప్రపంచవ్యాప్త 840 కోట్ల ప్రజలు దాని దుష్ప్రభావ వేడికి ప్రభావితం అయ్యారు, అవుతూనే ఉంటారు. రష్యా దండయాత్రకు ఓ పరిష్కారం సత్వరమే దొరకాలని కోరుకుందాం.

# అలుపెరుగని పోరాటం

**రెండు దశాబాద్ధాలకు పైగా ఆరాటం..!**

**కనీస వసతులు కల్పించాలని రాష్ట్ర ఉన్నత న్యాయ స్థానం ఉత్తర్వులు**

**హై కోర్టు ఆదేశాలు ఉన్న దక్కని న్యాయం**

**ఆదిభట్ల భూదాన్ ప్లాట్ల లబ్ధిదారుల 20 ఏళ్ల నిరీక్షణ..!**

**కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా.. చిరకాల కల నెరవేరేనా..?**



**ప్రతిఘటన, తెలంగాణ బ్యూరో ప్రతినిధి**

పేదలకు పంచిన భూదాన్ భూముల్లో ప్లాట్లపై ఆశలు పెంచుకున్నపేదలు గత రెండు దశాబ్ధాలకుపైగా అలుపెరుగని పోరాటం చేస్తున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2005లో భూదాన్ యజ్ఞబోర్డ్ పేదలకు భూదాన్ పంచేందుకు రంగారెడ్డి జిల్లా, ఇబ్రాహీంపట్నం మండలం పరిధిలోని ఆదిభట్ల గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నెం: 51, 52, 53 లోని దాదాపు 70 ఎకరాలకు పూగా ఉన్న భూదాన్ భూమిలో లే ఔట్ చేసి 963 మంది పేదలను గుర్తించి 150 చ.గజాల చోప్పున ప్రొసిడింగ్‌లు జారీ చేసింది. ఆ ప్రొసింగ్‌ల ఆధారంగా అప్పటి ఇబ్రహీంప్రట్నం మండల తహసీల్ధార్ కూడా పట్టాలు జారీ చేశారు. పట్టాలు జారీ కావడంతో లబ్ధిదారులంతా తమ సొంతింటి చిరకాల కల నెరవేరబోతుందని ఎంతో ఆశపడ్డారు. కానీ.. అంతలోనే వాళ్ల ఆశలు అడియాసలు అయ్యాయి. పారిశ్రామిక వాడల కోసం అప్పటి రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం తీసుకువచ్చిన సెజ్‌లు శాపంగా మారాయి. భూదాన్ గ్రామదాన్ యాక్ట్ ప్రకారం భూదాన్ భూములపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు ఎటువంటి అజమాయిషీ ఉండదు. చట్ట ప్రకారం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు భూదాన్ భూములను ఎట్టి పరిస్థితులలో సేకరించకూడదు. వాటి జోలికి వెళ్లకూడదు. అంత పకడ్బందిగా అప్పటి కేంద్ర ప్రభుత్వం చట్టం చేసింది. కానీ భూదాన్ గ్రామదాన్ చట్టాన్ని తుంగలో తొక్కి2007లో కాంగ్రెస్ ప్రభుత్వం పరిశ్రమల కోసం ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (ఏపీఐఐసీ) పేరుతో ఆదిభట్లలోని భూదాన్ భూమిని సైతం సెజ్‌లో చేర్చింది నాటి సర్కార్. ఈ భూమి పక్కనే ఏరో స్పెస్‌కు వందల ఎకరాలు కేటాయించింది. ప్రస్తుతం ఖాళీగా ఉన్న భూదాన్ భూమిలోని కొంత భాగం ప్లాట్లు కూడా ఏరోస్పేస్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. అయితే అప్పటి కాంగ్రెస్ సర్కార్ ఆదిభట్ల భూములను ఏపీఐఐసీ పేరుతో స్వాధీనం చేసుకొని పేదల ఆశలపై నీళ్లు చల్లింది. అప్పటి నుండి భూదాన్ భూమిలో ప్లాట్లు పొందిన లబ్ధిదారులు ఇప్పటికీ 2 దశాబ్దాలకుపైగా అలుపెరుగని పోరాటం చేస్తునే ఉన్నారు.

### హైకోర్టు ఆర్డర్ సైతం భేఖాతర్..!

సొంతింటి కళపై ఆశలు చంపుకోని ఆదిభట్ల భూదాన్ ప్లాట్ల లబ్ధిదారులు అంతా ఏకమై ఆచార్య వినోభనగర్ ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్ పేరుతో సంఘటితమయ్యారు. తమకు న్యాయం చేయాలని 2022 ఏప్రీల్ నెలలో రాష్ట్ర హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. విచారణకు స్వీకరించిన హైకోర్టు అదే ఏడాది ఆర్డర్ నెం: డబ్ల్యూపీ నెం:17201/2022 జారీ చేసి ప్రభుత్వానికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఆదిబట్ల భూదాన్ భూములలో ప్లాట్లు పొందిన లబ్ధిదారులకు డ్రైనేజీ, విద్యుత్, రోడ్లు తదితర మౌలిక సదుపాయాలతో పాటు ఇండ్ల నిర్మాణం కోసం ప్రభుత్వం వసతులు ఏర్పాటు చేయాలని ఉత్తర్వులు జారీ చేసింది. కానీ.. గౌరవ హైకోర్టు ఉత్తర్వలను సైతం అప్పటి ప్రభుత్వం, అధికారులు భేఖాతరు చేశారు. వాటి అమలు చేయకుండా ఉన్నత న్యాయస్థానం ఆదేశాలను సైతం అప్పటి ప్రభుత్వ అధికారులు బుట్టదాఖలు చేశారు. ఇప్పటికైన కాంగ్రెస్ ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని ఆదిభట్ల భూదాన్ భూముల ప్లాట్ల లబ్ధిదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

### ఇప్పటికైనా న్యాయం చేయండి



ఆదిభట్ల భూదాన్ భూముల ప్లాట్ల లబ్ధిదారుల సంఘం ఆచార్య వినోభానగర్ ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్ తరుపున గత గత ఐదేళ్లుగా పోరాటం చేస్తున్నాం. పేదలకు కేటాయించిన భూదాన్ ప్లాట్లను అప్పటి రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం 2007లో సెజ్‌ల పేరుతో భూదాన్ భూములకు కూడా పరిశ్రమల కోసం స్వాధీనం చేసుకుంది. అప్పుడు తమకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా భూదాన్ భూములలో ఇచ్చిన ప్రొసిడింగ్‌లను, మండల కార్యాలయం నుండి పొందిన పట్టా సర్టిఫికెట్లను కూడా పరిగణంలోకి తీసుకోకుండా ఏకపక్షంగా ఏపీఐఐసీ (ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్‌కు అప్పగించారు. ఇక అప్పటి నుండి మా పోరాటం జరుగుతూనే ఉంది. సొంతి ఆశ మమ్మల్ని ఇంకా పోరాటం వైపు నడిపిస్తునే ఉంది. చివరికి 2022 లో గౌరవ రాష్ట్ర హైకోర్టు మా తరుపున న్యాయమైన తీర్పును వెల్లడించింది. కానీ అధికారులు ఉన్నత న్యాయస్థానం తీర్పును సైతం భేఖాతరు చేశారు. కోర్టు ఉత్తర్వలను సైతనం పట్టించుకోలేదు. ఇప్పటికై ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా న్యాయం జరుగుతోందిని ఆశగా ఉన్నాం. మాకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి న్యాయం చేస్తారని ఎంతో ఆశగా ఉన్నాం. మాకు న్యాయం చేయాలని కోరుకుంటున్నాం.

**దార మంజులు అధ్యక్షురాలు ఆచార్య వినోభానగర్ ప్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్**

# కవితాలోకాన కల్పవల్లి.. దేవులపల్లి

**తెలుగు భావ కవితా రంగంలో ఆయన ఒక ముఖ్య అధ్యాయం.**

ఆయన కవిత్వంలో భావుకత్వం వెల్లివిరుస్తుంది.. ఆయన రాసే గీతాల్లో లాలిత్యం పాఠకులను తన్మయత్వంలో మునిగితేలేలా చేస్తుంది. తెలుగు సినిమా రంగాన ఆయన పాటలు జగద్విఖ్యాతం. ఆంధ్రా షెల్లీగా ప్రఖ్యాతి గాంచి "కృష్ణపక్షం" వంటి గొప్ప రచనను తెలుగు పాఠకులకు అందించిన ఆ మేటి సాహితీ దురంధరుడే "దేవులపల్లి కృష్ణశాస్త్రి". రేడియోలో లలిత గీతాలు, నాటికలు, సినిమాల్లో పాటలు రాయడం ద్వారా ప్రఖ్యాతి పొందారు.దేవులపల్లి కృష్ణశాస్త్రి తూర్పు గోదావరి జిల్లా, పిఠాపురం దగ్గరలోని రామచంద్రపాలెం గ్రామంలో తమ్మన్నశాస్త్రి, సీతమ్మ దంపతులకు నవంబరు 1, 1897 తేదీన జన్మించారు. అతని విద్యాభ్యాసమంతా పిఠాపురం పాఠశాలలో సాగింది. పాఠశాల రోజుల్లోనే కూచి నరసింహం, రఘుపతి వెంకటరత్నం వంటి రచయితల వద్ద ఆంగ్ల సాహిత్యాన్ని ఔపోసన పట్టాడు కృష్ణశాస్త్రి. 1918లో విజయ నగరం వెళ్లి డిగ్రీ చేస్తున్న రోజుల్లోనే ఆయనకు కవిత్వం రాయడం పట్ల మమకారం ఏర్పడింది. డిగ్రీ పూర్తి చేసి పెద్దాపురంలో ఉపాధ్యాయుడిగా ఉద్యోగంలో చేరాక ఆయన పూర్తిస్థాయిలో రచనా వ్యాసంగాన్ని మొదలు పెట్టారు. బ్రహ్మసమాజం లోను, నవ్య సాహితీసమితి లోను సభ్యునిగా, భావ కవిత్వోద్యమ ప్రవర్తకునిగా దేశమంతటా ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సమయంలో ఎందరో కవులతోను, పండితులతోను పరిచయాలు కలిగాయి. ప్రాచ్య, పాశ్చాత్య సాహిత్యాన్ని అధ్యయనం చేశారు. పిఠాపురంలోని హరిజన వసతి గృహంతో సంబంధం ఏర్పరచుకొని హరిజనోద్ధరణ కార్యక్రమాలలో పాల్గొన్నందున బంధువులు అతనిని వెలివేశారు. అయినా వెనుకాడని కృష్ణశాస్త్రి వేశ్యావివాహ సంస్థను ఏర్పాటు చేసి ఎందరో కళావంతులకు వివాహాలు నిర్వహించారు. 1922లో కృష్ణశాస్త్రి సతీమణి అర్ధాంతరంగా మరణించడంతో కొన్నాళ్లు అదే బాధలో గడిపారు ఆయన. అదే బాధలో అనేక విషాద కవితలు రాశారు. ఊహా ప్రేయసి, ఆత్మాశ్రయత్వం, ప్రవాసము, ఊర్వశి వంటి ఖండకావ్యాలు అలా పుట్టినవే. 1929లో రవీంద్ర నాథ్ టాగుర్‌తో ఏర్పడిన పరిచయం కృష్ణశాస్త్రి జీవితాన్ని మరో మలుపు తిప్పింది. మరిన్ని కవితా రచనలను చేసేలా ప్రేరేపించింది.లాలిత్యం, సారళ్యం, ప్రకృతి సౌందర్యం



- కృష్ణశాస్త్రి పాటల్లోని ప్రధాన లక్షణాలు. భావోద్వేగాలకు, హృదయ స్పందనలకు అక్షర రూపమిచ్చి భావ కవితలంత సుకుమారంగా ప్రణయ విరహ గీతాల్ని రాసిన కవి. చందమామ లోని చల్లదనాన్ని, మందార పువ్వులోని మకరందాన్ని, గుండెలోని ఆర్ద్రతని రంగరించి రాస్తే అది కృష్ణశాస్త్రి పాటవుతుంది. పట్టు పరికిణిలో ఒదిగిన సింగారం కృష్ణశాస్త్రి పాట. ఆయన తెలుగు పదం అమ్మమ్మ చేతిలో నేతి నైవేద్యం. వర్షం వచ్చేముందు వీచే చల్లనిగాలి తెమ్మెర తనువును తాకితే ఎంత పులకరిస్తామో, కృష్ణశాస్త్రి కవిత వింటుంటే అదే పులకరింత వీనుల విందుగా వస్తుంది. భావ కవిత్వానికి సినిమా పాటల ద్వారా ఒక శాశ్వత స్థానాన్ని ఏర్పాటు చేసి, దిశానిర్దేశం చేసిన అతి కొద్ది మంది కవులలో కృష్ణశాస్త్రి ముందుంటారు. తెలుగు సినిమాల్లో జనని జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసి.. అని భరతమాతను కీర్తించినా, జయ జయ జయ ప్రియ భారత జనయిత్రీ దివ్య ధాత్రి.. అంటూ దేశభక్తిని చాటినా.. ఆకులో ఆకునై , పువ్వులో పువ్వునై , నునులేత రెమ్మనై, సెలయేటిలో పాటనై, తెరచాటు తేటినై , నీలంపు నిగ్గునై... అని మగువ ఆర్ద్రతకు పెద్దపీట వేసినా అది కృష్ణశాస్త్రికే చెల్లింది. భావ కవిగా, 'ఆంధ్రా షెల్లీ 'గా ప్రసిద్ధులైన దేవులపల్లి వేంకట కృష్ణశాస్త్రి... 1942లో బి.ఎన్.రెడ్డి ప్రోత్సాహంతో 'మల్లీశ్వరి (1951)'తో చిత్రరంగంలో అడుగుపెట్టి, సినిమా పాటకు కావ్య గౌరవం కలిగించి, మల్లీశ్వరితో ప్రారంభించి కృష్ణశాస్త్రి ఎన్నో చక్కని సినిమా పాటలు అందించారు. అవి సామాన్యులనూ, పండితులనూ కూడా మెప్పించే సాహితీ పుష్పాలు. తరువాత అనేక చిత్రాలకు సాహిత్యం అందించాడు. 1957లో ఆకాశవాణిలో చేరి తెలుగు సాహిత్య ప్రయోక్తగా అనేక గేయాలు, నాటికలు, ప్రసంగాలు అందించారు. పిలచిన బిగువటరా, -- మనసున మల్లెల మాలలు, ఆకాశ వీధిలో హాయిగా , ఔనా.. నిజమేనా? సడి సేయకో గాలి

ప్రతి రాత్రి వసంత రాత్రి,

రానిక నీకోసం, ఆకులో ఆకునై,

ఆరనీకుమా ఈ దీపం, గోరింట పూచింది, పగలైతే దొరవేరా, గట్టుకాడ ఎవరో, కుశలమా.. నీకు కుశలమేనా, చుక్కలతో చెప్పాలని, అడుగడుగున గుడి ఉంది, రావమ్మా మహాలక్ష్మి, ఎవరు నేర్పేరమ్మ ఈ కొమ్మకు, ఈనాటి బంధం ఏనాటిదో, వేళ చూస్తే.. సందె వేళ, చీకటి వెలుగుల కౌగిటిలో, పాడనా తెనుగు పాట,

ఇది మల్లెల వేళయనీ, మావి చిగురు తినగానే, లాంటి పాటలు సినీ సాహిత్యంలో అజరామరాలు. 1975లో-ఆంధ్ర విశ్వవిద్యాలయం - కళాప్రపూర్ణ, 1978లో సాహిత్య అకాడమీ అవార్డు, 1976లో పద్మ భూషణ్ దేవులపల్లి ని వరించాయి. 1964 లో తిరుపతిలో అన్నమయ్య జయంతి ఉత్సవంలో కృష్ణశాస్త్రి పాల్గొన్నారు. ఆయన వెంట బాలాంత్రపు రజనీ కాంతరావు కూడా వెళ్ళారు. ఉపన్యాసం చదివేందుకు ఉద్యుక్తుడైన కృష్ణశాస్త్రి గొంతు బొంగురు పోయింది. దాంతో తన ఉపన్యాసాన్ని రజనీకాంతరావు చేత చదివించారు. వైద్య పరీక్షల్లో అది గొంతు క్యాన్సర్ అని నిర్ధారణ అయింది. మద్రాసులో కృష్ణశాస్త్రి స్వరపేటికను తొలగించారు. స్వరపేటిక తొలగించిన తరువాత కృష్ణశాస్త్రి దాదాపు పదహారేళ్లు బ్రతికినా, మూగవోయిన కంఠంతోనే అనేక సినిమాలకు పాటలు, ఆకాశవాణికి లలిత గీతాలు రాశారు. 1980 ఫిబ్రవరి 24న కృష్ణశాస్త్రి మరణించారు. తెలుగు దేశపు నిలువుటద్దం బద్దలైంది. షెల్లీ మళ్లీ మరణించాడు' అంటూ కృష్ణశాస్త్రి చనిపోయిన రోజున శ్రీశ్రీ రోదించాడు. కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ స్పందిస్తూ 'ఒక్క షెల్లీ యే కాదు, కీట్స్, వర్డ్స్‌వర్త్ వంటి మహాశయుల సంయుక్త స్వరూపం కృష్ణశాస్త్రి' అన్నారు.

ప్రతిఘటన
తెలుగు దిన పత్రిక
మంగళవారం 24 ఫిబ్రవరి 2026

## ప్రభుత్వ, మున్సిపల్ స్థలాలు ప్రజా అవసరాల కోసం వినియోగించాలి

భాగ్యనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కనుగుల శ్రీనివాస్



**ప్రతిఘటన, హైదరాబాద్ బ్యూరో :** యాకుత్ పుర సర్కిల్ పరిధిలోని ప్రభుత్వ మున్సిపల్ స్థలాలను రక్షించి ప్రజా అవసరాల కోసం వినియోగించాలని భాగ్యనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కనుగుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో చార్మినార్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి కి ప్రజాహిత వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అధ్యక్షులు కనుగుల శ్రీనివాస్ మాట్లాడుతూ.. యాకుత్ పుర సర్కిల్ పరిధిలో అనేక మున్సిపల్, ప్రభుత్వ స్థలాలు ప్రజలకు ఎటువంటి ఉపయోగంలో లేకుండా ఉండాయి అన్నారు. ఇట్టి ఖాళీ స్థలాలను అభివృద్ధి చేసి ప్రజా అవసరాల కోసం పబ్లిక్ హెల్త్ సెంటర్లు, లైబ్రరీ, క్రీడా మైదానాలు, జీహెచ్ఎంసీ కార్యాలయాలు ఏర్పాటు చేయాలని జోనల్ కమిషనర్ కు వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు. జోనల్ కమిషనర్ సానుకూలంగా స్పందించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో భాగ్యనగరం వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సుంకరి వేణు, కోశాధికారి మహేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాల అమలులో తీవ్ర నిర్లక్ష్యం

### సామ మహేందర్ రెడ్డి



**ప్రతిఘటన, మహేశ్వరం రిపోర్టర్ ముత్తయ్య** మహేశ్వరం నియోజకవర్గంలో ప్రజలకు సంబంధించిన పలు సంక్షేమ పథకాల అమలు విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో తీవ్ర నిర్లక్ష్యం చోటు చేసుకుంటోందని మహేశ్వరం నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ కార్యదర్శి సామ మహేందర్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యంగా కల్యాణలక్ష్మి, షాదిముబారక్ పథకానికి సంబంధించిన చెక్కులు వచ్చి మూడు, నాలుగు నెలలు గడిచినా, లబ్ధిదారులకు ఇప్పటికీ అందకుండా ఆలస్యం చేయడం బాధాకరమన్నారు. కక్షపూరిత రాజకీయాల కారణంగా తమ నియోజకవర్గ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి మీద ఉన్న వ్యక్తిగత ద్వేషంతో చెక్కులు నిలిపివేయడం పూర్తిగా అన్యాయని పేర్కొన్నారు. పేద కుటుంబాల పెళ్లిళ్ల కోసం ఇవ్వాల్సిన ఆర్థిక సహాయాన్ని రాజకీయ కోణంలో చూసి ఆలస్యం చేయడం అమానుషమన్నారు. ఈ విధమైన కక్షసాధింపు రాజకీయాలను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. వెంటనే పెండింగ్‌లో ఉన్న కళ్యాణ లక్ష్మి చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేయాలని సంబంధిత అధికారులను ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాము. ఇవ్వని పక్షంలో అవసరమైతే ప్రజలతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు.

## ఔట్ లెట్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపెట్టాలి



**ప్రతిఘటన, మహేశ్వరం రిపోర్టర్ ముత్తయ్య** జీహెచ్ఎంసీ మీర్ పేట్ 60వ డివిజన్ లోని సాయి సామ్రాట్ నగర్ కాలనీ లో దీర్ఘకాలికంగా నెలకొన్న భూగర్భ డ్రైనేజీ ఔట్ లెట్ సమస్యను అధికారులు త్వరగా పరిష్కరించాలని మాజీ కార్పొరేటర్ ఎనుగుల అనిల్ కుమార్ యాదవ్ కోరారు. బడంగ్ పేట్ సర్కిల్ డీఈ వెంకన్న ఏఈ సౌమ్య, మున్సిపల్ వర్క్ ఇన్స్పెక్టర్ అశోక్ ఔట్ లెట్ సమస్యను పరిశీలించారు. ఎనుగుల అనిల్ కుమార్ వారికి దీర్ఘకాలికంగా ఉన్న సమస్యను, మురుగు సమస్యతో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఆదేశానుసారం శంషాబాద్ జోనల్ కమిషనర్ చంద్రకళ కి ఇటీవల కాలనీ వాసులతో కలసి వినతి పత్రం ఇచ్చామని తెలిపారు. సోమవారం సాయి సామ్రాట్ నగర్ కాలనీలో నెలకొన్న మురుగు సమస్య పరిష్కారానికి భూగర్భ ఔట్ లెట్ పనులను త్వరితగతిన మొదలు పెట్టడానికి అధికారులు వచ్చి పరిశీలించడం జరిగిందన్నారు. త్వరగా పరిష్కరించే విధంగా కృషి చేయాలని అధికారులను తాను కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు లక్ష్మారెడ్డి, విమల్ శుక్లా, పర్వతాల్ రెడ్డి పాల్గొన్నారు

## తప్పు చేసినట్లు నిరూపిస్తే రాజకీయాలు వదిలేస్తా: వెంకటరమణారెడ్డి

**హైదరాబాద్ :** కామారెడ్డి లో కాంగ్రెస్– బిజెపి నేతల మధ్య వివాదం ముదిరింది. కాంగ్రెస్ నేతలు, బిజెపి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డికి కామారెడ్డిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల భూముల విషయంలో వివాదం చోటు చేసుకుంది. క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టరేట్ కు వెంకటరమణారెడ్డి బయలు దేరారు. డిగ్రీ కళాశాల అంశంపై కలెక్టర్ కు వినతిపత్రం ఇవ్వనున్నారు. తాము కూడా కలెక్టరేట్ కు వస్తామని కాంగ్రెస్ నేతలు ప్రకటించారు. ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి ఇంటిముందు పోలీసులు బందోబస్తు ఉంది. ప్రభుత్వ డిగ్రీ కళాశాల భూములు కబ్జాకు గురవుతున్నాయని వెంకటరమణారెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్ నేత షబ్బీర్ అలీకి సవాల్ విసిరారు. తాను తప్పు చేసినట్లు నిరూపిస్తే రాజకీయాలు వదిలేస్తానని, డిగ్రీ కాలేజీ భూముల్లో ఒక్క గజం ఆక్రమించినా రాజీనామా చేస్తానని అన్నారు. ఎన్ని కేసులు పెట్టినా భయపడేది లేదని, ఎవరు రెచ్చగొడుతున్నారో పోలీసులకు తెలియదా? అని ప్రశ్నించారు. ఆర్ టిఐ కింద కాలేజీ భూముల వివరాలు అడిగానని, పూర్తి వివరాలు వచ్చాక.. అందరి సంగతి చూస్తానని కాటిపల్లి వెంకటరమణారెడ్డి

# ప్రధాన రహదారుల్లో జంతు కళేబరాలు





**ప్రతిఘటన, మహేశ్వరం రిపోర్టర్ ముత్తయ్య** జల్పల్లి, పహాడీషరీఫ్, షాహీనగర్ డివిజన్ల లోని ప్రాంతాలలో మృతి చెందిన జంతువులు, వాటి వ్యర్థాలను గుర్తు తెలియని వ్యక్తులు వేయడంతో అవి కుళ్లి వాటి నుండి వచ్చే దుర్వాసనతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని జల్పల్లి వాసులు, వాహనదారులు పేర్కొంటున్నారు. కార్గో రోడ్డులో, పహాడీషరీఫ్ నుంచి మామిడిపల్లికి వెళ్లే దారిలో, జల్పల్లి కమాన్ రోడ్డులో, జల్పల్లి కమాన్ నుంచి కొంచెం ముందుకు వెళ్లి లెఫ్ట్ సైడ్ విద్యుత్ సబ్ స్టేషన్ దారి వద్ద ముస్తఫా కు వెళ్లే దారిలో మృతి చెందిన జంతు కళేబరాలు కొందరు గుర్తు తెలియని వ్యక్తులు డంప్ చేస్తున్నారని వాటి వ్యర్థాలను ఇతర ప్రాంతాల నుండి రాత్రి సమయాల్లో వేస్తున్నారు. అవి కుళ్లిపోయి దుర్వాసన వస్తుండంతో పరిసర ప్రాంతాల వాళ్లు ఇబ్బందులకు గురవుతున్నారు. కొంత మంది స్థానికులు ఈ ప్రాంతాన్ని పరిశీలించారు . చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ రహదారుల్లో వెళ్ళేవారు దుర్వాసన భరించలేక వాంతులు చేసుకుంటున్నారు. వాహనదారులు అసౌకర్యానికి గురవుతున్నారు. ముక్కు మూసుకునే సమయంలో అదుపు తప్పి కిందపడి గాయాల పాలవుతున్నారు. గుర్తు తెలియని వ్యక్తులు గుట్టు చప్పుడు కాకుండా చీకట్లో జంతు వ్యర్థాలను ఈ ప్రాంతంలో వేసి చేతులు దులుపుకుంటున్నారు. కోల్డ్ స్టోరేజీల నుండి తీసుకొచ్చి వేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గత సంవత్సరం నుండి ఇప్పటి వరకు మృతిచెందిన 40 గేదేలను, 50 పందులను, 10 ఆవులను, 5 గుర్రాలను ఈ రహదారులలో వేశారు. వీటితోపాటు దాదాపు 100 క్వింటాళ్ల జంతు వ్యర్థాలను మున్సిపాలిటీ



అధికారులు జేసీబీ ద్వారా గుంత తీసి పూడ్చి వేయడం జరిగిందని అధికారలు తెలిపారు. ఈ ప్రాంతాలలో సీసీ కెమెరాలు లేవనే ధైర్యంతోనే ఇతర ప్రాంతాల నుండి గుర్తు తెలియని వ్యక్తులు ఇక్కడ జంతు వ్యర్థాలను పడవేస్తున్నారని జల్పల్లి వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే ఈ ప్రాంతంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

### దుర్వాసనను తట్టు కోలేకపోతున్నాం

కార్గో రోడ్డులో, పహాడిషరీఫ్ నుంచి మామిడిపల్లికి వెళ్లే ప్రధాన రహదారులలో, జల్పల్లి కమాన్ రోడ్డులో, జల్పల్లి కమాన్ నుంచి కొంచెం ముందుకు వెళ్లి లెఫ్ట్ సైడ్ సబ్ స్టేషన్ వద్ద ముస్తఫా కు వెళ్లే దారిలో, షాహీన్ నగర్ నుంచి వెంకటాపూర్ వెళ్లే రహదారిలో మృతి చెందిన జంతు కళేబరాలు, చెత్తను పడేస్తున్నారు. ఈ రహదారుల్లో వెళ్ళాలంటే దుర్వాసనను తట్టు కోలేకపోతున్నాము. ఇతర





ప్రాంతాల నుండి మృతి చెందిన జంతువులను తెచ్చి ఈ రహదారిలో వేస్తున్నారు. ప్రతి రోజు రాత్రి సమయాల్లో జంతు వ్యర్థాలను వేయడంతో ఈ రహదారిలో వెళ్ళే ఇతర ప్రాంతాలవారు. జల్పల్లి, షాహినగర్, పహాడీషరీఫ్ డివిజన్ ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి, జంతు వ్యర్థాలను వేసే వారిని గుర్తించి కేసులు నమోదు చేయాలి. మళ్లీ ఈ ప్రాంతాలలో జంతు వ్యర్థాలను వేయకుండా జీహెచ్ఎంసీ అధికారులు చర్యలు తీసుకోవాలి.

## ఎన్నికల ప్రచార రథాలను ప్రారంభించిన కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి



**ప్రతిఘటన, మహేశ్వరం రిపోర్టర్ ముత్తయ్య** రాబోవు ఎంపీటీసీ, జెడ్పీటీసీ, జీహెచ్ఎంసీ ఎన్నికలకు సిద్ధం కావాలని కాంగ్రెస్ శ్రేణులకు మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి పిలుపు నిచ్చారు. తుక్కుగూడ కార్యాలయంలో ప్రచార రథాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కేఎల్ఆర్ మాట్లాడుతూ.. సర్పంచ్, మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను అఖండ మెజార్టీతో గెలిపించిన ఓటర్లకు ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో అభివృద్ధి సంక్షేమం జోడు గుర్రాల్లా పరుగెడుతున్నాయని కొనియాడారు. భవిష్యత్తులో జరిగే ఎంపీటీసీ, జెడ్పీటీసీ, జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల విజయం కోసం ప్రచార రథాలను మహేశ్వరం , కందుకూరు మండలాలకు పంపారు. ఈ సందర్భంగా ప్రచార కమిటీ కో – ఆర్డినేటర్స్ ను నియమించారు. మహేశ్వరం మండలానికి రాజు నాయక్, శివ నర్కుడ, రాఘవేందర్ రెడ్డి, కందుకూరు మండలానికి సరికొండ మల్లేష్, విష్ణువర్ధన్ రెడ్డి, ఢిల్లీ శ్రీధర్, గాదె కుమార్ ను కో – ఆర్డినేటర్స్ గా నియమించారు.

## గుండెపోటుతో దోమల మల్లేష్ మృతి



**ప్రతిఘటన, మహేశ్వరం రిపోర్టర్ ముత్తయ్య** హైదరాబాదు నగరంలోని కాచిగూడ ఎస్సి హాస్టల్ పూర్వ విద్యార్థి దోమల మల్లేష్ గుండె పోటుతో మృతి చెందారు. ఆయన స్వగ్రామం పల్లెపహాడ్, మండలం, నార్కెట్ పల్లి, నల్గొండకు జిల్లాకు చెందిన దళిత కుటుంబం నుంచి వచ్చిన దోమల మల్లేష్ ఎన్నో అవమానాలను ఓర్చుకొన్నాడు. మాదిగ విద్యార్థి సమాఖ్య హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు, సాంఘిక సంక్షేమ హాస్టల్లో దండోరా ఉద్యమ పునాది వేశారు. అందర్నీ కదిలించేది కలుపుకు పోయేది.. అన్ని తానై పెద్ద మనిషిగా నడిపించాడు. ప్రేమ అంటేనే జీర్ణించుకోలేని సమాజంలో ఆదర్శ ప్రేమ వివాహం (కులాంతర) రెడ్డి మహిళను వివాహం చేసుకున్నాడు. కుల వ్యవస్థ కు ఎదురొడ్డి తన పిల్లలను ఉన్నత స్థానంలో పై చదువులకోసం అమెరికాకు పంపి వారిని అభివృద్ధి పథంలో నిలిచే క్రమంలో తన ప్రాణాలను విడిచి శాశ్వతంగా తిరిగి రాని లోకానికి వెళ్లాడు. బడుగు జీవుల పెద్దన్న దోమల మల్లేష్ కు కాచిగూడ సాంఘిక సంక్షేమ హాస్టల్ పూర్వవిద్యార్థులు మాదిగ జాతి తరపున విద్యార్థి నాయకుల తరఫున దండోరా ఉద్యమాల కన్నీటి నివాళి అర్పించారు.

## ప్రభుత్వ స్థలాల ఆక్రమణకు పాల్పడితే కఠిన చర్యలు

మున్సిపల్ చైర్మన్ శ్రీవాణి రవి కుమార్



**యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతిఘటన బ్యూరో రిపోర్టర్ జంగిటి రవీందర్** భువనగిరి మున్సిపాలిటీలో ప్రభుత్వ స్థలాల ఆక్రమణకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని చైర్మన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవి కుమార్ హెచ్చరించారు. సోమవారం భువనగిరి పట్టణంలోని హుస్సేనాబాద్ శివారులో సర్వే నెంబర్ 157లో ప్రభుత్వ భూమి ఇండోర్ స్టేడియంకు కేటాయించిన స్థలంలో చేపట్టిన అక్రమ నిర్మాణాన్ని అడ్డుకున్నారు. ఇండోర్ స్టేడియం స్థలం చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణం గురించి జిల్లా స్పోర్ట్స్ అండ్ యూత్ అధికారితో మాట్లాడారు. ఈ సందర్బంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ భూమిని ఎవరైన అక్రమంగా కబ్జా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో భువనగిరి తాహసిల్దార్ అంజిరెడ్డి, మున్సిపల్ కమిషనర్, కౌన్సిలర్ కర్ణాకర్, నాయకులు హిరేకార్ శ్రీను, అధికారులు వార్డ్ ప్రజలు పాల్గున్నారు.

## నాలాని ఆక్రమించి లే ఔట్ చేసిన హరిమోహన్ రెడ్డి పైన కఠిన చర్యలు తీసుకోవాలి

రంగనాథ్ కు వినతి

కబ్జాలకు గురైన దాదాపు 109 ఎకరాల సున్నం చెరువుని కాపాడాలి



**ప్రతిఘటన, మహేశ్వరం రిపోర్టర్ ముత్తయ్య** మహేశ్వరం నియోజకవర్గం లోని శంషాబాద్ జోన్ బడంగ్ పేట్ సర్కిల్ 61వ డివిజన్ లోని నాదర్ గుల్ ఓల్డ్ విలేజ్ లోని గ్రీన్ హోమ్స్ కాలనీ లో నాలా ని అక్రమంగా మూసివేసి లే ఔట్ చేసిన హరిమోహన్ రెడ్డి పైన కఠిన చర్యలు తీసుకోవాలని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ కు కాంగ్రెస్ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నాలాలు అక్రమంగా మూసివేసి పైప్ లైన్ వేసిన నాలా ని ఓపెన్ చేయాలని అలాగే కబ్జాలకు గురైన దాదాపు 109 ఎకరాల సున్నం చెరువుని కాపాడాలని కోరడం జరిగిందన్నారు. స్పందించిన కమిషనర్ అక్కడ శాటిలైట్ ద్వారా నాలా మ్యాప్ ని ఓపెన్ చేసి 2001 లో ఎలా వున్నది, ప్రస్తుతం ఎలా వున్నది అని స్పెషల్ టీం కి చూపించారు. మ్యాప్ ఆధారంగా స్పెషల్ టీం తో త్వరలో వస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం లో మాజీ సర్పంచ్ హనుమంత్ రెడ్డి , మహేశ్వరం నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు వల్లపు సుభాన్ యాదవ్, మహేశ్వరం నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ అంకంగారి వెంకటేష్ గౌడ్, సీనియర్ నాయకులు ఆనంద్ రెడ్డి, బంగారి అశోక్, కుమార్ యాదవ్ , యాతం సాయి పాల్గొన్నారు.

ప్రతిఘటన
తెలుగు దిన పత్రిక
మంగళవారం 24 ఫిబ్రవరి 2026

# జీవో 252 తో వర్కింగ్ జర్నలిస్టులు నష్టపోతున్నారు

**ప్రతిఘటన, మహేశ్వరం రిపోర్టర్ ముత్తయ్య** జీవో 252 తో వర్కింగ్ జర్నలిస్టులు నష్టపోతున్నారని, జీవో 252 ని సవరించి ప్రభుత్వం జర్నలిస్టుల పట్ల సానుకూల నిర్ణయం తీసుకోవాలని రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శేరిబాయి గణేష్, మైల సైదులు అన్నారు. టీడబ్ల్యూజేఎఫ్ రంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట, డెస్క్ జర్నలిస్ట్ లకు, వర్కింగ్ జర్నలిస్టుల అందరికి ప్రభుత్వ గుర్తింపు కార్డును ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ధర్నాకు చేపట్టారు. ఈ సందర్భంగా జర్నలిస్ట్ లు మాట్లాడుతూ.. ప్రభుత్వం నుంచి స్పష్టత వచ్చే వరకు జిల్లా అక్రిడిటేషన్ కమిటీ నియామక ప్రక్రియను నిలిపి వేయాలన్నారు. వర్కింగ్ జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రఘు మాట్లాడుతూ.. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని, రెట్టింపు అక్రిడిటేషన్ కార్డులు ఇస్తామని చెప్పి.. ఉన్నవాటిలో ఎందుకు కోతలు విధిస్తుందని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. జర్నలిస్టులను ఉద్ధరిస్తున్నామని చెప్పుకుంటూ కొత్త జీవోలు తీసుకొచ్చి వర్కింగ్ జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డులు ఇవ్వకుండా కొత్త సమస్యలు సృష్టిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫేక్ జర్నలిస్టుల ఏరి వేత పేరుతో వర్కింగ్ జర్నలిస్టులకు అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. నియోజకవర్గం మున్సిపాలిటీ మండలాలో పనిచేసే జర్నలిస్టులతో పాటు డెస్క్ లో పని చేసే వారికి కూడా అక్రిడిటేషన్ కార్డులు ఇచ్చి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. వర్కింగ్ జర్నలిస్టులకు అన్యాయం జరిగితే సహించేది లేదని హెచ్చరించారు. జీఓ 252 సవరించాకే అక్రిడిటేషన్ కమిటీని నియమించాలని జిల్లా అద్యక్ష, కార్యదర్శులు ఎస్. గణేష్, యం. సైదులు జిల్లా కలెక్టర్, డీపీఆర్వో లను డిమాండ్ చేశారు. ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 252 వర్కింగ్ జర్నలిస్టులు నష్టపోతున్నారన్నారు. జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వకుండా కోతలు ఎందుకు పెడుతున్నారని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అదే విధంగా ప్రెస్ అకాడమీ చైర్మన్ మరోసారి వర్కింగ్ జర్నలిస్టులకు జరుగుతున్న అన్యాయాన్ని దృష్టిలో పెట్టుకుని వర్కింగ్ జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డు లు వచ్చేలా జీవో ను సవరించిన తర్వాతే అక్రిడిటేషన్ కమిటీని నియమించాలని లేదంటే తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలను ఉదృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం డీఆర్ఓ, డీపీఆర్వో లకు వినతిపత్రం అందజేశారు. జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులను అందించాలని డిమాండ్ చేస్తూ సమస్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు చంద్ర శేఖర్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు చిలువేరు సురేష్, ఎండి కాజా పాషా, జిల్లా డెస్క్ జర్నలిస్ట్ లు సంఘం రాష్ట్ర నాయకులు అజయ్ కుమార్, రాజేందర్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వెంకటేష్, సుదర్శన్, మణి, నర్సింహారెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు క్రాంతి, అంజి, శ్రీశేలం, శ్రీనివాస్, శివ, నియోజకవర్గాల అధ్యక్ష కార్యదర్శులు పల్లటి జగన్, రాఘవేందర్ గౌడ్, శంకర్, సురేందర్, నర్సింహా, భూచ్చన్న, భగవంతు, జర్నలిస్ట్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.




# బాధిత కుటుంబానికి పూర్తి అండగా ఉంటాం






**దుండగుల్ని అరెస్టు చేసే వరకు ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం**

**ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గోవింద నరేష్ మాదిగ**

**ప్రతిఘటన, నాగర్ కర్నూల్ బ్యూరో రిపోర్టర్ విజయ్ కాంత్** కుమ్మెర సంఘటన లో భాగంగా నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం దగ్గర ఏర్పాటు చేసిన ధర్నా కార్యక్రమం బీసీ, ఎస్సీ, ఎస్టీ జాక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. బాధిత కుటుంబానికి అండగ ఎమ్మార్పీఎస్, ఎంఇఎఫ్, ఎంఎస్ఎఫ్, బీఎస్పీ, బహుజన టీచర్స్ సంఘాలు సంఘీభావం తెలిపాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేష్ మాదిగ హాజరయ్యారు. ఈ సంఘటన ఉద్దేశించి మాట్లాడుతూ.. పాప చనిపోయి ఐదు రోజులు గడుస్తున్న గణేష్ కుటుంబం బజారున పడిన, నేటికీ సంఘటన చేసిన రెడ్డిలను అరెస్టు చేయకపోవడం శోచనీయకమన్నారు. చాకలి సామాజిక వర్గానికి మాదిగ సామాజిక వర్గానికి మధ్యలో పుట్టిన ఆ పాపకు పేరు చిన్నారి ఐలమ్మగా అభివర్ణించాలని వారన్నారు. ఆ పాప బ్రతికే ఉంటే చంపిన రెడ్లకు మరణ శాసనం రాసేదని వారన్నారు. ఏ రాజకీయ జోక్యం లేకుండా రాజ్యాంగాన్ని గౌరవించి చట్టపరంగా కేసును దర్యాప్తు చేయడం జరిగితే, ఈ 8 మంది రెడ్లలో ఏ రెడ్డిని మినహాయించకుండా, ఏ రెడ్డిని వదిలి పెట్టకుండా వీరిపై నాన్ బెయిల బుల్ కేస్ పెట్టాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ, మర్డర్ కేసులు పెట్టి నిష్పక్షపాతంగా బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి సొంత జిల్లాలో ఇంత పెద్ద సంఘటన జరిగితే ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి ఈ సంఘటనపై స్పందిస్తే రెడ్ల ముఖ్యమంత్రిగా కాకుండ, సామాజిక వర్గాల ముఖ్యమంత్రిగా నిలుస్తారని కోరుకుంటున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ జాక్ జిల్లా కన్వీనర్ నిరంజన్ ముదిరాజ్, ఎమ్మార్పీఎస్ నాయకులు టైగర్ జంగయ్య, ఎంఎస్పీ జిల్లా నాయకులు కరిగల దశరథం, ఎమ్మార్పీఎస్ నాయకులు గూట విజయ్, కోళ్ల శివ, బీఎస్పీ నాయకులు పోలేపల్లి రామచందర్, మాదిగ టీచర్స్ జానయ్య, గుడిపల్లి నిరంజన్, విష్ణు, బీసీ ఎస్సీ ఎస్టీ జాక్ నాయకులు, వివిధ కుల సంఘాల నాయకులు మహిళలు పాల్గొన్నారు.

# మార్చి నెలలో ప్రవేశపెట్టి బడ్జెట్ లో తగిన నిధులు కేటాయించాలి






**సాగు, త్రాగునీరు, మూసీ కాలుష్యం, విద్య, వైద్యం, రహదారులు, ఉపాధి, మౌలిక అంశాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలి**

**సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు యండి జహంగీర్**

**ప్రతిఘటన, యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో రిపోర్టర్ జంగిటి రవీందర్** మార్చి నెలలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టబోయే 2026 - 27 వార్షిక బడ్జెట్లో యాదాద్రి భువనగిరి జిల్లా సాగు, త్రాగునీరు కోసం, మూసీ జల కాలుష్య నివారణకు, విద్య, వైద్యం, రహదారులు, ఉపాధి, మౌలిక అంశాల అభివృద్ధికి తగిన నిధులు కేటాయించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు యండి జహంగీర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో 2026 - 27 వార్షిక బడ్జెట్ లో జిల్లా అభివృద్ధికి తగిన నిధులు కేటాయించాలని కోరుతూ జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించిన అనంతరం జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ధర్నా కార్యక్రమాన్ని ఉద్దేశించి జహంగీర్ మాట్లాడుతూ జిల్లాలో అత్యంత కీలకమైన బస్వాపురం ప్రాజెక్టు పూర్తి నిర్మాణానికి ఈ బడ్జెట్ లో 500 కోట్ల రూపాయల నిధులు కేటాయించాలని కోరారు. ఇప్పటికే ప్రాజెక్టు 90% పైగా పూర్తయిందని మిగతా పని పూర్తి కావాలన్నా , నిర్వాసితులకు పూర్తిస్థాయి నష్ట పరిహారం అందాలన్నా వెంటనే నిధులు కేటాయించాలన్నారు. ప్రాజెక్టు పూర్తయితే 10 మండలాలలోని లక్ష ఎకరాలకు పైగా భూమి సాగులోకి వస్తుందని తెలిపారు. మరోపక్క డిండి ఎత్తిపోతల పరిధిలోని శివన్నగూడెం ప్రాజెక్టు పనులకు నిర్వాసితుల నష్ట పరిహారానికి కూడా నిధులు కేటాయించాలాని అన్నారు. నారాయణపురం మండలానికి సంపూర్ణంగా నీళ్లు ఇవ్వడం కోసం రాచకొండ ఎత్తిపోతలకు నిధులు కేటాయించాలని సూచించారు. గంధమల్ల ప్రాజెక్ట్ కు నిధులు కేటాయించామని ప్రభుత్వం చెప్తుందని కేవలం కొంత మంది భూ నిర్వాసితులకు మాత్రమే నష్టపరిహారం ఇచ్చారని మిగతా నిర్వాసితులతో పాటు ప్రాజెక్టు పనులకు కూడా నిధులు కేటాయించాలని కోరారు. ముఖ్యమంత్రి మూసీ ప్రక్షాళ చేసి రసాయన పరిశ్రమల కాలుష్యం, వ్యర్థాలు, మురికి నీరు కలవకుండా కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పి సంవత్సరంపైగా గడుస్తున్న ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదని అన్నారు. ఇప్పటికైనా సంగెం, నెమిలెకాల్వ, ధర్మారెడ్డిపల్లి, పిల్లాయిపల్లి, బునాదిగాని కాల్వల పరిధిలలో ఎస్.టీ.పీ ల నిర్మాణానికి తగిన నిధులు కేటాయించాలని సూచించారు. జిల్లా కేంద్రంలో నేటికీ ప్రభుత్వ డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్ కాలేజీలు లేవని ఈ బడ్జెట్ లో నన్న తగిన నిధులు కేటాయించి భువనగిరి జిల్లా కేంద్రంతో పాటు చౌటుప్పల్ పట్టణంలో కూడా ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని కోరారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఆపరేషన్ ఎక్యుప్ మెంట్స్, లాప్రోస్కోపీ మొదలగు పరికరాల కొనుగోలుకు సమగ్ర నిధులు ఇవ్వాలని కోరారు. యాదగిరిగుట్టలో మెడికల్ కాలేజీ భవనం త్వరితగతిన పూర్తి చేసి రామన్నపేట, మోత్కూరు, ఆలేరు మండల కేంద్రాలలో వంద పడకల ఆసుపత్రుల నిర్మాణానికి తగిన నిధులు బడ్జెట్లో కేటాయించాలని అన్నారు. చిట్యాల - భువనగిరి ప్రధాన రహదారి విస్తరణకు తగిన నిధులు కేటాయించి ప్రజలను కాపాడాలని, ఆలేరు రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు నిధులు కేటాయించి ప్రకటించాలని, గ్రామీణ అంతర్గత రోడ్లు, దళిత వాడలు, గిరిజన తండాల అభివృద్ధికి నిధులు కేటాయింపు మరియు జిల్లా కేంద్రంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, ఫ్యాక్టరీస్ ఇన్స్ పెక్టర్ ఆఫీస్, డి.సి.ఎల్ ఆఫీస్, పి.ఎఫ్.ఎన్ ఫోర్స్ మెంట్ ఆఫీసులు మంజూరు చేసి ఈ బడ్జెట్ లోనే నిధులు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. నిధుల సాధనకు జిల్లాలో ఉన్న ఐదుగురు కాంగ్రెస్ శాసనసభ్యులు బాధ్యత తీసుకోవాలని జహంగీర్ వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ్మ , బట్టుపల్లి అనురాధ పాల్గొని మాట్లాడారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాటూరి బాలరాజు, కల్లూరి మల్లేశం, దాసరి పాండు, జిల్లా కమిటీ సభ్యులు కోమటిరెడ్డి చంద్రారెడ్డి, బొలగాని జయరాములు, మాయ కృష్ణ, గంగాదేవి సైదులు, ఎంఏ. ఇక్బాల్, మధ్యపురం రాజు, ఆలేరు మండలం కార్యదర్శి ధూపాటి వెంకటేష్, బొమ్మలరామారం మండల కార్యదర్శి ర్యాకల శ్రీశైలం, తుర్కపల్లి మండల కార్యదర్శి పోతరాజు జహంగీర్, యాదగిరిగుట్ట పట్టణ కార్యదర్శి నూకల భాస్కర్ రెడ్డి తో పాటు ఈర్లపల్లి ముత్యాలు, లావుడియా రాజు, వనం రాజు, గంధమల్ల మాతయ్య, బందెల ఎల్లయ్య, కొండమడుగు నాగమణి, చింతల శివ, బర్ల వెంకటేష్, కొండాపురం యాదగిరి, ఉస్మాన్ షరీఫ్, వల్దాస్ అంజయ్య, ఎదునూరి వెంకటేష్, బోడ అంజయ్య, ఎండి. బాబు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డుకు అడ్డంగా ఉన్న చెట్టు కొమ్మలను తొలగించిన ఎన్ఎస్ఎస్ విద్యార్థులు




**యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతిఘటన బ్యూరో రిపోర్టర్ జంగిటి రవీందర్** మండలంలోని తుక్కపురం గ్రామం నుండి గౌస్ నగర్ వెళ్లే దారిలో రోడ్డుకు అడ్డంగా ఉన్న చెట్టు కొమ్మలను ఎన్ఎస్ఎస్ విద్యార్థులు తొలగించారు. భువనగిరి శ్రీ లక్ష్మీనరసింహస్వామి కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ -× శీతాకాల ప్రత్యేక శిబిరం 4వ రోజు సోమవారం రోడ్డుకు అడ్డంగా ఉన్న చెట్టు కొమ్మలను తొలగించి శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సర్పంచ్ జనగాం పాండు, ఉపసర్పంచ్ రాసాల లింగస్వామి యాదవ్, గ్రామ కార్యదర్శి లోకేష్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ తోటకూరి రామకృష్ణ, ఎన్ఎస్ఎస్ యూనిట్ - × వాలంటీర్స్ పాల్గొన్నారు.

## తుక్కాపూర్ లో పోచమ్మ గుడి పునర్నిర్మాణ పనులు

**శంకుస్థాపన చేసిన సర్పంచ్ జనగాం పాండు**



**ప్రతిఘటన, యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో రిపోర్టర్ జంగిటి రవీందర్** మండలంలోని తుక్కాపూర్ గ్రామ 10 వ వార్డు ఎస్సీ కాలనీ (మర్రిగూడెం)లో పోచమ్మ గుడి పునర్నిర్మాణ పనులకు సర్పంచ్ జనగాం పాండు శంకుస్థాపన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా భూమి పూజ చేసి పోచమ్మ గుడి నిర్మాణంకై ముగ్గు పోశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రాసాల లింగస్వామియాదవ్, 10 వ వార్డు మెంబరు ఎలకొండ అలివేలరాజశేఖర్ రెడ్డి, మాజీ సర్పంచులు నోముల మహేందర్ రెడ్డి, పుట్ట వీరేష్ యాదవ్, మాజీ ఎంపీటీసీ రాసాల మల్లేష్ యాదవ్, నల్లమాస సత్యనారాయణ గౌడ్, మాజీ ఉప సర్పంచ్ ముంత సతీష్, పడమటి జైపాల్ రెడ్డి, వార్డు మెంబర్లు జనగాం మహేష్, రత్నపురం శ్రీకాంత్, జనగాం ఇందిరమ్మయాదగిరి, రాసాల శరత్ యాదవ్, ఏడుమేకల మహేష్, వల్లపూ సతీష్ యాదవ్, ముంత కృష్ణవేణిరమేష్ యాదవ్ , దొమ్మాటి భాగ్యలక్ష్మిదేవేందర్, జనగాం మహేష్, రాసాల రాజు, రత్నపురం వెంకటేష్, రత్నపురం పురుషోత్తం, రత్నపురం శ్రీనివాస్, పాశం యాదగిరి, గుడిసె నర్సింహ, పాశం దేవేందర్, పాశం నరేష్, పాశం నరేశ్, జహంగీర్, గుడిసె శ్రీను, గుడిసె స్వామి, స్వామి, జహంగీర్, కుమార్, శ్రీకాంత్, సతీష్, గ్రామ పెద్దలు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

## ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం వద్దు

## జిల్లా ఎస్పీ డి.జానకి,

**మహబూబ్ నగర్ :** జిల్లా ప్రజలకు వేగవంతమైన న్యాయం అందించడం పోలీస్ శాఖ ముఖ్య బాధ్యత అని జిల్లా ఎస్పీ డి.జానకి, తెలిపారు. సోమవారం నిర్వహించిన ఫిర్యాదుల దినోత్సవం సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులను ఎస్పీ గారు స్వయంగా కలుసుకుని వారి సమస్యలను క్షుణ్ణంగా విని స్పందించారు. ఈ సందర్భంగా మొత్తం 19 ఫిర్యాదులు స్వీకరించగా, ప్రతి ఫిర్యాదును ప్రాధాన్యంగా పరిగణించి సంబంధిత అధికారులకు వెంటనే పంపించి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. కొన్ని అంశాలపై ఎస్పీ గారు స్వయంగా సంబంధిత అధికారులతో నేరుగా ఫోన్ ద్వారా మాట్లాడి, ఫిర్యాదుదారులకు తక్షణ న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఎస్పీ మాట్లాడుతూ, ప్రజలు పోలీస్ శాఖపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టడం అత్యంత ముఖ్యం అని, ఫిర్యాదుల పరిష్కారంలో ఎలాంటి అలసత్వం లేదా నిర్లక్ష్యం సహించబడదని తెలిపారు. ప్రతి ఫిర్యాదు దారునికి గౌరవప్రదంగా స్పందిస్తూ, సమస్యల పరిష్కారంలో పారదర్శకత, వేగం మరియు బాధ్యతాయుత వైఖరి పాటించాలని అధికారులకు సూచించారు. ప్రజల సమస్యలకు సమయానికి స్పందించడం ద్వారా పోలీస్ శాఖపై విశ్వాసం మరింత బలపడుతుందని, ఫిర్యాదుదారులకు ప్రాధాన్యత ఇవ్వడం తమ విధి మరియు బాధ్యత అని జిల్లా ఎస్పీ పేర్కొన్నారు.

## ఆదిలాబాద్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం..

## బ్రిడ్జి పై నుంచి ఆర్టీసీ బస్సు

**ఆదిలాబాద్ :** ఆదిలాబాద్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఉట్నూరు మండలం శ్యామ్‌పూర్‌లో సోమవారం ఉదయం బ్రిడ్జి పై నుంచి ఆర్టీసీ బస్సు కింద పడింది. ఈ ఘటనలో ఐదుగురు ప్రయాణికులు గాయపడ్డారు. ఇది గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. స్థానికుల సమాచారంతో ఘటనాస్థలికి వచ్చిన పోలీసులు, అత్యవసర సేవల సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి గురైన బస్సును ఆసిఫాబాద్ డిపోనకు చెందినదిగా గుర్తించారు. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

## సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ వార్షిక క్రీడా పోటీలను ప్రారంభించిన పోలీస్ కమిషనర్

**సిద్దిపేట :** స్థానిక పోలీస్ పెరేడ్ మైదానంలో సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ వార్షిక క్రీడా పోటీలను పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్ ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారుల గౌరవ వందనాన్ని స్వీకరించిన అనంతరం క్రీడలను ఉద్దేశించి ప్రసంగించారు. ఇటీవల జరిగిన 4వ తెలంగాణ రాష్ట్ర పోలీస్ క్రీడల్లో సిద్దిపేట కమిషనరేట్ పోలీసులు అద్భుత ప్రతిభ కనబరిచిందని కమిషనర్ ప్రశంసించారు. ఈ పోటీల్లో మన సిద్దిపేట విభాగం:3 బంగారు పతకాలు2 వెండి పతకాలు7 కాంస్య పతకాలుమొత్తం 12 పతకాలను సాధించి కమిషనరేట్ కీర్తిని రాష్ట్ర స్థాయిలో చాటిన విజేతలను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ. నిరంతరం విధులతో ఒత్తిడికి గురయ్యే పోలీస్ సిబ్బందికి క్రీడలు ఎంతో ఉపశమనాన్ని ఇస్తాయని తెలిపారు. క్రీడల వల్ల తోటి సిబ్బందిలో స్ఫూర్తిని నింపుతాయని, మైదానంలో ఆడే శారీరక క్రీడలు ఆరోగ్యాన్ని మెరుగు పరుస్తాయి. అధికారులు మరియు సిబ్బంది సమయాన్ని వృథా చేసే, ఆర్థికంగా నష్టపరిచే ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లకు ఎట్టి పరిస్థితుల్లోనూ ఆకర్షితులు కావద్దని, అటువంటి వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. క్రీడా స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ తమ ప్రతిభను చాటాలని ఆకాంక్షిస్తూ, క్రీడాకారులందరికీ శుభాకాంక్షలు తెలిపి పోటీలను

ప్రతిఘటన
తెలుగు దిన పత్రిక
మంగళవారం 24 ఫిబ్రవరి 2026

## బిజినెస్

### ట్రేడ్ డీల్ వాయిదా

**భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందంపై పునరాలోచన**

**యూఎస్ సుప్రీంకోర్టు తీర్పుతో అనిశ్చితి**



**న్యూఢిల్లీ :** భారతదేశం-అమెరికా మధ్య తాత్కాలిక వాణిజ్య ఒప్పందాన్ని ఖరారు చేయడానికి ఫిబ్రవరి 23న వాషింగ్టన్‌లో ప్రారంభం కావాల్సిన చర్చలు వాయిదా పడ్డాయి. ఒప్పందంలో భాగంగా జరగాల్సిన ప్రధాన సంధానకర్తల కీలకమైన సమావేశం సోమవారం ప్రారంభం కావాల్సి ఉంది. ట్రంప్‌నకు వ్యతిరేకంగా అమెరికా సుప్రీంకోర్టు చారిత్రాత్మక తీర్పు, తర్వాత ప్రకటించిన కొత్త పన్ను విధానాలు అనిశ్చితిని పెంచాయి. దీంతో సమావేశం వాయిదా పడింది. దర్పన్ జైన్ నేతృత్వంలోని భారత ప్రతినిధి బృందం, అమెరికా వాణిజ్య ప్రతినిధి జామిసన్ గ్రీర్, అతని బృందం సమావేశం కావాల్సి ఉంది. ఫిబ్రవరి 20న, ట్రంప్ పరిపాలన విధించిన దిగుమతి పన్నులు రాజ్యాంగ విరుద్ధమని అమెరికా సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది.దీని తర్వాత, ఫిబ్రవరి 24 నుంచి అన్ని దేశాలపై కొత్తగా 10 శాతం పన్ను విధిస్తామని ట్రంప్ ప్రకటించారు. మరుసటి రోజు దాన్ని 15 శాతానికి పెంచుతున్నట్లు ప్రకటించారు. ఈ కొత్త పరిస్థితులు ఆర్థిక వ్యవస్థను ఎలా ప్రభావితం చేస్తాయో అస్పష్టంగా ఉంది. విదేశాల నుంచి దిగుమతి చేసుకున్న వస్తువులపై విస్తృత సుంకాలు విధించే అధికారాన్ని అమెరికా సుప్రీంకోర్టు కొట్టివేసినప్పటికీ, భారతదేశంతో వాణిజ్య ఒప్పందంలో మార్పు ఉండదని ట్రంప్ వెల్లడించారు. ఒప్పందం ప్రకారం భారతదేశం నుంచి వచ్చే వస్తువులపై విధించిన 18 శాతం సుంకం కొనసాగుతుందని కూడా ఆయన పునరుద్ఘాటించారు.


### క్రెడిట్ కార్డు యూజర్లకు అలర్ట్

**గడువు కంటే ముందే బిల్లు చెల్లిస్తే లాభమా? నష్టమా?**

ఈ రోజుల్లో క్రెడిట్ కార్డులు దాదాపు ప్రతి ఒక్కరు వాడుతున్నారు. కానీ నెలవారీ బిల్లు జనరేట్ అయిన వెంటనే, ఒక పెద్ద ప్రశ్న తలెత్తుతుంది. స్టేట్‌మెంట్ అందిన వెంటనే బిల్లు చెల్లించాలా, లేదా గడువు తేదీ వరకు వేచి ఉండటం మంచిదా?బిల్లు చెల్లింపు సమయం మీ క్రెడిట్ స్కోర్‌ను నేరుగా ప్రభావితం చేస్తుంది కాబట్టి ఈ గందరగోళం తరచుగా వినియోగదారులలో కొనసాగుతుంది. ఈ విషయంలో సరైన దశలను, అది మీ ఆర్థిక జీవితాన్ని ఎలా ప్రభావితం చేస్తుందో చూద్దాం..మీ ఇమెయిల్ లేదా ఫోన్‌లో క్రెడిట్ కార్డ్ స్టేట్‌మెంట్ సందేశం వచ్చినప్పుడు, చాలా మంది గడువు తేదీ వరకు వేచి ఉంటే వారి ఐదీబ్ని స్కోరు పడిపోతుందేమో అని ఆందోళన చెందుతారు. వాస్తవం ఏమిటంటే మీరు స్టేట్‌మెంట్ వచ్చిన వెంటనే చెల్లించాలా లేదా గడువు తేదీలోపు మీ బిల్లును చెల్లించడానికి గ్రేస్ పీరియడ్‌ని ఉపయోగించాలా అనేది మీ క్రెడిట్ స్కోరుకు పట్టింపు లేదు. మీ చెల్లింపు బ్యాంకు నిర్దేశించిన గడువులోపు జరిగితే, మీ ఆర్థిక రికార్డు పూర్తిగా సురక్షితంగా ఉంటుంది. మీ ఆర్థిక సౌలభ్యం, నగదు లభ్యతను బట్టి మీరు ఏదైనా ఎంపికను ఎంచుకోవచ్చు.గడువు తేదీ వరకు వేచి ఉండటంలో తప్పు లేదు, కానీ నిర్లక్ష్యం కారణంగా ఈ గడువు దాటితే, మీకు నిజమైన ఇబ్బంది మొదలవుతుంది. బ్యాంకు గడువు తర్వాత చెల్లింపు చేయడం ఆలస్య చెల్లింపుగా పరిగణించబడుతుంది. ఇది మీ మొత్తం క్రెడిట్ చరిత్రను తీవ్రంగా దెబ్బతీసే తీవ్రమైన తప్పు. మీ ఐదీబ్ని స్కోరు దెబ్బతిన్న తర్వాత, భవిష్యత్తులో గృహ రుణం, కారు రుణం లేదా కొత్త కార్డు పొందడం చాలా కష్టం అవుతుంది. అందువల్ల, బిల్లులను సకాలంలో చెల్లించడం ఆర్థిక ప్రాధాన్యతగా చేసుకోవడం చాలా ముఖ్యం.క్రెడిట్ కార్డ్ బిల్లింగ్ స్టేట్‌మెంట్‌లలో ఎల్లప్పుడూ రెండు రకాల మొత్తాలు కనిపిస్తాయి. మొత్తం బకాయి, కనీస బకాయి. కనీస మొత్తాన్ని లేదా కనీస బకాయిని చెల్లించడం వల్ల బ్యాంకు జరిమానాలను నివారించవచ్చని, వారి శ్రేయస్సును నిర్ధారిస్తుందని ప్రజలు తరచుగా అనుకుంటారు. అయితే ఆర్థిక దృక్కోణం నుండి, ఇది ఒక పెద్ద ఉచ్చు అని నిరూపించబడింది. మిగిలిన మొత్తం అంటే కనీస మొత్తం, వచ్చే నెలకు ముందుకు తీసుకెళ్లబడుతుంది.

# సాంకేతిక ప్రగతి వెనుక పొంచి ఉన్న నీటి గండం!

**న్యూఢిల్లీ :** కృత్రిమ మేధ...అదే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్. ఇప్పుడు ఎవరి నోట విన్నా వినిపిస్తున్న పేరు. ఇప్పటికే అనేక ఐటీ కంపెనీలు ఈ సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటున్నాయి. దీనిపై ప్రపంచవ్యాప్తంగా అనేక సదస్సులు, సమావేశాలు జరుగుతున్నాయి. మూడు రోజుల క్రితం దేశ రాజధాని ఢిల్లీలోనూ దీనిపై అంతర్జాతీయ సదస్సును నిర్వహించారు. దీనికి ప్రధాని నరేంద్రమోడీ సహా తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో పాటు పలు రాష్ట్రాల ప్రతినిధులు హాజరయ్యారు. పలు దేశాలకు చెందిన ఏఐ సంస్థల అధినేతలు, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంస్థల మధ్య వేలకోట్ల రూపాయలు విలువైన ఒప్పందాలు జరిగాయి. ఇదంతా నాణేనికి ఓ వైపు.మరోవైపు ఏఐ చేస్తున్న పర్యావరణ విధ్వంసం ప్రపంచానికి ఆందోళన కలిగిస్తుంది. భారీగా ఏర్పాటు చేసే ఏఐ డేటా సర్వర్లు శీతల వాతావరణంలోనే పనిచేస్తాయి. వాటిని చల్లబర్చేందుకు బిలియన్ల కొద్దీ గ్యాలన్ల తాజా నీటిని వినియోగిస్తారు. దీనివల్ల మానవాళికి తాగునీటి సమస్య తీవ్రమయ్యే ప్రమాదం పొంచి ఉందని ఐటీరంగ నిపుణులు చెప్తున్నారు. కరువు కాటకాలతో విలవిలల్లాడే ప్రాంతాల్లో ఏఐ సర్వర్లను ఏర్పాటు చేస్తే, అక్కడి ప్రజలకు మరిన్ని నీటి కష్టాలు తప్పవని హెచ్చరిస్తున్నారు.చల్లదనం ఎందుకు?డేటా సెంటర్లకు చల్లదనం అవస రాన్ని సాంకేతిక నిపుణులు చక్కగా విశ్లేషించారు. కంప్యూటర్లు తీవ్రమైన వేడిని ఉత్పత్తి చేస్తాయి. మీరు ఏఐని ఒక కవిత రాయమనో లేదా ఓ చిత్రాన్ని గీయమనో అడిగితే ఒకేసారి వేలాది ప్రాసెసర్లు పనిచేయాల్సి ఉంటుంది. ఫలితంగా తీవ్రమైన థర్మల్ ఎనర్జీ వెలువడుతుంది. ఆ వేడికి కోట్లాది రూపాయలు ఖరీదు చేసే యంత్రాలు కరిగిపోయే ప్రమాదం ఉంది. దానిని నివారించేందుకే డేటా కేంద్రాలు కూలింగ్ టవర్లను ఉపయోగిస్తాయి. ఈ వ్యవస్థలు ఆవిరైపోయే చల్లదనం ద్వారా పనిచేస్తాయి. వేడిగా ఉన్న ఉపరితలాలపై నీటిని వెదజల్లడం ద్వారా వాతావరణాన్ని చల్లబరుస్తారు. ఈ నీటిలో 80 శాతం ఆవిరి రూపంలో వాతావరణంలో కలిసి పోతుంది. ఆవిరిని రీసైక్లింగ్ చేయలేము కాబట్టి అది స్థానిక నీటి చక్రం నుంచి అదృశ్యమైపోతుంది. అంటే దీనర్థం ఏమిటి? ప్రతి రోజూ మిలియన్ గ్యాలర్ల నీరు ఆవిరైపోతుంది కానీ అందులో ఒక్క చుక్క కూడా తిరిగి ఉపయోగపడదు.రీసైక్లింగ్ నీరు వాడితే...టెక్ కంపెనీలు రీసైక్లింగ్ నీరును లేదా కాలుష్య



కారక వ్యర్థ జలాలను ఉపయోగించుకోవచ్చు కదా అనే ప్రశ్న సహజం. కానీ నీటిలో సహజంగానే కాల్షియం, మెగ్నీషియం వంటి ఖనిజాలు ఉంటాయి. శీతలీకరణ పక్రియ ద్వారా నీరు ఆవిరై పోతుంది. అంటే ఈ ఖనిజాలు మరింతగా కేంద్రీకృత మవుతాయన్న మాట. చివరికి అవి లైమ్‌స్కేల్ (గట్టి సున్నపు నిక్షేపం. ఇది తరచుగా వేడి నీటి కోసం ఉపయోగించే బాయిలర్లు, పైపుల లోపల పేరుకుపోతుంది) అనే గట్టి పెంకును ఏర్పరుస్తాయి. ఇది చాలా హానికరమైనది. మందపాటి దుప్పటి మాదిరిగా పనిచేస్తూ వేడిని బంధిస్తుంది. పంపులలో ప్రవాహాన్ని అడ్డుకుంటుంది. రీసైకిల్ చేసిన నీటిలోని ఖనిజాలు ఏఐ డేటా సెంటర్లలోని ఉష్ణ వినిమయాలను నష్టపరుస్తుంది. రీసైకిల్ చేసిన నీటిలో సహజంగానే ఖనిజాలు అధికంగా ఉంటాయి. కాబట్టి అది మొదటి నుంచే తన ప్రభావాన్ని చూపుతుంది. ఆ నీటిని సురక్షితంగా ఉపయోగించాలంటే కంపెనీలు పెద్ద ఎత్తున ఆన్-సైట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లను నిర్మించాల్సి ఉంటుంది. ప్రస్తుతం అమెరికాలో ఒక శాతం కంటే తక్కువ నీరే రీసైక్లింగ్ అవుతోంది. రీసైక్లింగ్ అయిన నీటిని పారిశ్రామిక ప్రాంతాలకు అందించే మౌలిక సదుపాయాలు కూడా అనేక నగరాలలో లేవు. కాబట్టి రీసైక్లింగ్ నీటితో పోలిస్తే డేటా సెంటర్లకు మంచి నీరే చౌకగా లభిస్తోంది.చల్లదనం ఉంటేనే పనిచేస్తాయిడిజిటల్ ప్రపంచం ఎలాంటి ఆటంకాలు లేకుండా ఎందుకు సజావుగా నడుస్తోందో ఎప్పుడైనా ఆలోచించారా? భారీ గిడ్డంగులలో నిరంతరం పని చేసుకుంటూపోతున్న సర్వర్లే దీనికి కారణం. అయితే అలా పనిచేస్తూ పోవాలంటే చల్లదనం అవసరం. గూగుల్ కంపెనీకి చెందిన డేటా సెంటర్లు ఒక సంవత్సర కాలంలో 6.1 బిలియన్ గ్యాలన్ల తాజా నీటిని వినియోగించుకున్నాయని ఆ సంస్థకు చెందిన పర్యావరణ నివేదిక (2024) తెలిపింది. నీటి వినియోగం యదార్థమేనని ఆ టెక్ దిగ్గజ సంస్థ అంగీకరించింది. 2014తో పోల్చినప్పుడు గూగుల్ డేటా సెంటర్లు 2023లో వాడుకున్న నీటి వినియోగం 17 శాతం పెరిగింది. అదే సమయంలో విద్యుత్ వినియోగం కూడా పెరిగిందని ఆ నివేదిక తెలియజేసింది.

సముద్రంలో నీటి చుక్క కాదుఈ నీటి వినియోగాన్ని కేవలం సముద్రంలో ఓ నీటి చుక్కగా చూడకూడదు. అమెరికా నైరుతి ప్రాంతంలో ఉన్న 41 గోల్ఫ్ కోర్సులకు నీటి పారుదల సౌకర్యం కల్పించేందుకు ఏటా ఎంత నీరు అవసరం అవుతుందో ఆ పరిమాణంలో నీటిని గూగుల్ డేటా సెంటర్లు వాడుకుంటున్నాయి. కృత్రిమ మేధ దిశగా సాంకేతిక పరిజ్ఞానం పరివర్తన చెందుతున్న తరుణంలో సర్వర్ల నీటి 'దాహాన్ని' తీర్చడం నానాటికీ కష్టమవుతోంది.పర్యావరణంపై ప్రభావంకృత్రిమ మేధ సాంకేతిక పరిజ్ఞానం కోసం డేటా సెంటర్లు మంచి నీటిని అధిక పరిమాణంలో వినియోగించడం పర్యావరణవేత్తలను ఆందోళనకు గురిచేస్తోంది. మోర్గాన్ స్టాన్లే నివేదిక ప్రకారం ఏఐ డేటా సెంటర్ల నీటి వినియోగం 2028 నాటికి 11 రెట్లు పెరుగుతుంది. ఇక్కడ గమనించాల్సిన ముఖ్య విషయమేమంటే నీటి కొరతతో ఇబ్బంది పడుతున్న ప్రాంతాల్లోనే డేటా సెంటర్లను ఏర్పాటు చేస్తున్నారు. ఏఐ సర్వర్లను చల్లగా ఉంచడం కోసం మంచి నీటికి పెరుగుతున్న డిమాండ్ కరువు పీడిత ప్రాంతాలలో నీటి సరఫరాకు ముప్పును కలిగిస్తోంది. కృత్రిమ మేధ మన జీవితాలతో పెనవేసుకుపోతున్న కొద్దీ మనకు అత్యంత విలువైన సహజ వనరులపై ఒత్తిడి మరింత తీవ్రమవుతోంది.

# ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్‌లో రూ.590 కోట్ల మోసం

ముంబయి: హరియాణా ప్రభుత్వం నిర్వహిస్తున్న ఖాతాల్లో తమ ఉద్యోగులు, ఇతరులు చేసిన రూ.590 కోట్ల మోసాన్ని ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ ఆదివారం వెల్లడించింది. బ్యాంకింగ్ నియంత్రణ సంస్థ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు ఈ విషయాన్ని వెల్లడించడంతో పాటు పోలీసులకు కూడా ఫిర్యాదు చేసినట్లు స్టాక్ ఎక్స్ఛేంజీలకు సమాచారమిచ్చింది. చండీగఢ్‌లోని ఒక శాఖలో కొంతమంది ఉద్యోగులు హరియాణా రాష్ట్ర ప్రభుత్వ ఖాతాల్లో ప్రాథమికంగా అనధికారిక, మోసపూరిత కార్యకలాపాలు నిర్వహించినట్లు గుర్తించినట్లు ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ పేర్కొంది. ఇతర వ్యక్తులు/సంస్థలు/ కౌంటర్‌పార్టీలు కూడా ఇందులో భాగమయ్యే అవకాశం ఉందని తెలిపింది. ప్రస్తుతం మోసం విలువను రూ.590 కోట్లుగా అంచనా వేసింది.తదుపరి సమాచారం, క్లెయిమ్‌ల ధ్రువీకరణ, రికవరీల ఆధారంగా తుది మొత్తాన్ని నిర్ణయిస్తామని వివరించింది. హరియాణా ప్రభుత్వ విభాగం ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్‌తో బ్యాంకింగ్ లావాదేవీలు నిర్వహిస్తోందని.. రుణదాతకు వెల్లడించని తేదీన క్లోజర్, బ్యాలెన్స్ బదిలీ కోసం మరొక బ్యాంకుకు అభ్యర్థన అందిందని ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ తెలిపింది. ఈ పక్రియలో ఖాతాలోని బ్యాలెన్స్‌తో పోలిస్తే, పేర్కొన్న మొత్తంలో వ్యత్యాసం కనిపించింది. అలాగే ఈ నెల 18 నుంచి హరియాణా ప్రభుత్వ సంస్థల ఇతర ఖాతాల్లో కూడా ఇలాంటి సమస్యలు గమనించినట్లు వివరించింది.




# భారీ ఓటమితో మైనస్‌లో టీమిండియా..

# సెమీస్ బెర్తుపై ఉత్కంఠ!

లీగ్ దశలో ఓటమెరుగని భారత జట్టు కీలకమైన సూపర్ 8లో మాత్రం ఘోరంగా విఫలమైంది. దక్షిణాఫ్రికా టాపార్డర్ జోరుకు కళ్లెం వేసి.. మధ్యలో పట్టు సడలించి.. ఆఖర్లో పంజా విసిరిన టీమిండియా.. ఛేదనలో మాత్రం తేలిపోయింది. 188 పరుగుల లక్ష్యాన్ని ఉ ఫ్ మనిపిస్తుందనుకుంటే.. సమిష్టి వైఫల్యంతో సఫారీలకు సరెండరైంది. ఊహించని విధంగా సూర్యకుమార్ యాదవ్ సేన పోరాడకుండానే మ్యాచ్‌ను అప్పగించేసిందనే బాధ అభిమానులను వెంటాడుతోంది. 76 పరుగుల తేడాతో ఓడిన కారణంగా నెట్ రన్‌రేటు మైనస్‌లో ఉంది. ఈ పరిస్థితుల్లో భారత్ సెమీస్ చేరడంపై సందిగ్ధం నెలకొంది. గ్రూప్ ఏ నుంచి టేబుల్ టాపర్‌గా సూపర్ 8లో అడుగుపెట్టిన భారత జట్టును నేలకు దించింది దక్షిణాఫ్రికా. ప్రస్తుతం భారత్ నెట్‌రన్‌రేటు మైనస్(-3.800)లో ఉంది. చివరి రెండు మ్యాచుల్లో భారీ తేడాతో గెలిస్తేనే సెమీస్ అవకాశాలుంటాయి. ఫిబ్రవరి 26న చిదంబరం స్టేడియంలో జింబాబ్వేతో.. మార్చి 1న వెస్టిండీస్‌తో సూర్యకుమార్ సేన తలపడనుంది. ఈ రెండు జట్లను ఓడిస్తే నాలుగు పాయింట్లతో టీమిండియా రేసులో ఉంటుంది. కానీ, లీగ్ దశలో ఆస్ట్రేలియా, శ్రీలంకను ఓడించిన జింబాబ్వేను తక్కువ అంచనా వేయడానికి లేదు. ఓపెనర్ బ్రియాన్ బెన్నెట్ కెప్టెన్ సికిందర్ రజా.. పేసర్లు ముజరబని, ఎవాన్స్, స్పిన్నర్ గ్రీవ్స్ సూపర్ ఫామ్‌లో ఉన్నారు. సెమీస్‌పై కన్నేసిన ఆఫ్రికా జట్టును ఓడించడం అసాధ్యమని చెప్పలేం కానీ.. సమిష్టిగా రాణిస్తేనే అది సాధ్యమవుతుంది. అలానే.. వెస్టిండీస్ సైతం సమిష్టిగా



రాణిస్తూ మాతో కష్టమే హెచ్చరికలు పంపుతోంది. షాయ్ హోప్ సారథ్యంలో ప్రమాదకరంగా పరిణమిస్తున్న విండీస్.. మూడో కప్ వేటలో పక్కాగా ఆడుతోంది. లీగ్ దశలో ఇంగ్లండ్‌ను ఓడించిన కరీబియన్ జట్టుపై భారత్‌కు మెరుగైన రికార్డే ఉంది. సో.. కచ్చితంగా ఓడిస్తేనే టీమిండియాకు సెమీస్ అవకాశాలుం టాయి. రెండుకు రెండు గెలవడమే కాకుండా దక్షిణాఫ్రికా తదుపరి మ్యాచుల ఫలితాలు కూడా కీలకం కానున్నాయి. జింబాబ్వే, వెస్టిండీస్‌తో సఫారీ టీమ్ ఓడాలి. అప్పుడు సూర్యకుమార్ సేన సెమీస్ బెర్తుకు దగ్గరవుతుంది. ఒకవేళ.. సఫారీ టీమ్ రెండు మ్యాచుల్లోనూ గెలిస్తే.. గ్రూప్ ఏ నుంచి రెండో స్థానం కోసం జింబాబ్వే, విండీస్, భారత్ మధ్య తీవ్ర పోటీ నెలకొంటుంది.

**బెడిసికొట్టిన సుందర్ ప్రయోగం..!**

డిఫెండింగ్ ఛాంపియన్‌గా టీ20 వరల్డ్‌కప్ బరిలో నిలిచిన భారత జట్టు అంచనాలకు తగ్గట్టే లీగ్ దశను అజేయంగా ముగించింది. నాకౌట్‌లోనూ దక్షిణాఫ్రికాను చిత్తు చేస్తుందని అందరూ అనుకున్నారు. ఎందుకంటే.. ప్రపంచకప్‌లో సఫారీలపై 5-2 విజయాల రికార్డు ఉంది. కానీ, అహ్మదాబాద్‌లో భారత క్రికెటర్ల ఆట లయ తప్పింది. అక్షర్ పటేల్‌ను తప్పించి తుది జట్టులోకి సుందర్‌ను తీసుకోవడం బెడిసికొట్టగా.. తొలి ఓవర్లోనే ఇషాన్ కిషన్ డకౌటవ్వడం.. ఆపై యాన్సెన్ తొలి బంతికే తిలక్ వర్మను వెనక్కి పంపడంతో భారత్ ఒత్తిడిలో పడింది. 6, 4తో టచ్‌లోకి వచ్చినట్టే కనిపించిన అభిషేక్ శర్మ సైతం పవర్ ప్లేలోనే వెనుదిరిగాడు. చూస్తుండగానే మూడు వికెట్లు పడిన వేళ.. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, హార్దిక్ పాండ్యాలు బ్యాట్ ఝులిపించి ప్రొటీస్ బౌలర్లపై పైచేయి సాధించలేదు. బుమ్రా, అర్ష్‌దీప్ విజృంభణతో 20కే మూడు వికెట్లు పడిన సఫారీ టీమ్‌ను డేవిడ్ మిల్లర్, డెవాల్డ్ బ్రెవిస్ విధ్వంసక ఆటతో ఆదుకున్నట్టు సూర్య, పాండ్యా భారత్‌ను గట్టెక్కించలేదు. వీరూ పెద్ద షాట్లకు యత్నించక సింగిల్స్ తీస్తూ ఉండడంతో మ్యాచ్ చేజారుతూ వచ్చింది. వీరిద్దరూ ఔటయ్యాక రింకూ సింగ్ సిక్సర్‌తో ఆశలు రేపినా.. తర్వాత బంతికే వికెట్ ఇచ్చేశాడు. వరల్డ్‌కప్‌లో తీవ్రంగా నిరాశపరుస్తున్న ఈ ఐపీఎల్ స్టార్ ఆదుకుంటాడనుకుంటే ఉసూరుమనిపించాడు. శివం దూబే(43) ఒంటరి సైనికుడులా పోరాడినా సరిపోలేదు. ఫలితంగా.. 111కే కుప్పకూలిన టీమిండియా.. 76 పరుగుల తేడాతో ఓడింది.

### దక్షిణాఫ్రికా పర్యటనకు ఆస్ట్రేలియా..

### ఆ వివాదం తర్వాత ఎనిమిదేళ్లకు..!

ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్‌లో అగ్రస్థానంలో కొనసాగుతున్న ఆస్ట్రేలియా సుదీర్ఘ విరామం తర్వాత దక్షిణాఫ్రికా పర్యటనకు వెళ్లనుంది. సాండ్‌పేపర్‌గేట్ వివాదం తర్వాత ఎనిమిదేళ్లకు ఆసీస్ ఆ దేశంలో అడుగుపెట్టనుంది. రెండు ఫార్మాట్ల సిరీస్‌లో ప్యాట్ కమిన్స్ సారథ్యంలోని కంగారూ టీమ్ సఫారీలతో తలపడనుంది. ఇరుజట్ల మధ్య మొదట వన్డే, ఆపై టెస్టు సిరీస్ జరుగనుంది. రెండు దేశాల బోర్డులు సోమవారం ఈ విషయాన్ని ధ్రువీకరించాయి. డబ్ల్యూటీసీలో ఆస్ట్రేలియా సెప్టెంబర్‌లో కీలకమైన సిరీస్ ఆడనుంది. దక్షిణాఫ్రికాతో మూడు టెస్టుల్లో కమిన్స్ సేన అమీతుమీ తేల్చుకోనుంది. సఫారీలపై 2018లో సాండ్‌పేపర్ గేట్ వివాదం తర్వాత ఆసీస్ జట్టుకు ఇదే తొలి పర్యటన. అప్పుడు స్టీవ్ స్మిత్ సారథ్యంలో ఆడిన కంగారూలు.. కేప్‌టౌన్ టెస్టులో అనూహ్యంగా వివాదంలో చిక్కుకున్నారు. కామెరూన్ బాన్‌క్రాఫ్ట్ బంతి ఆకారాన్ని మార్చేందుకు సాండ్ పేపర్‌తో రుద్దడం వీడియోల్లో రికార్డైంది. అతడికి కెప్టెన్ స్మిత్, వైస్ కెప్టెన్ డేవిడ్ వార్నర్ సహకరించారు. దాంతో.. ఈ ముగ్గురిపై ఆస్ట్రేలియా క్రికెట్ నిషేధం విధించింది.

విచారణ అనంతరం స్మిత్, వార్నర్ ఏడాదిపాటు సస్పెండ్ అయ్యారు. బాన్‌క్రాఫ్ట్ 9 నెలలు ఆటకు దూరమయ్యాడు. ఈ ఘటనతోనే స్మిత్ కెప్టెన్సీ పోగుట్టుకోగా.. టిమ్ పైన్ నయా సారథిగా ఎంపికయ్యాడు. ఎనిమిదేళ్ల విరామం తర్వాత ఆసీస్ మళ్లీ కేప్‌టౌన్‌లో టెస్టు మ్యాచ్ ఆడనుంది. అప్పుడు జట్టు సభ్యులైన కమిన్స్, లియన్, మిచెల్ స్టార్క్, హేజిల్‌వుడ్‌లు ఈసారి కూడా ఆడబోతున్నారు.

## స్పోర్ట్స్

### బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు సంచలన నిర్ణయం!



బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (బీసీబీ) సంచలన నిర్ణయం తీసుకుంది. మాజీ క్రికెటర్ మొన్‌జురుల్ ఇస్లాంపై వేటు వేసింది. తమ పరిధిలోకి వచ్చే క్రికెట్ సంబంధిత వ్యవహారాలన్నింటికీ దూరంగా ఉండాలని అతడిని ఆదేశించింది. ఈ మేరకు అతడిపై నిషేధం విధిస్తూ ప్రకటన జారీ చేసింది. అసలేం జరిగిందంటే.. ప్రపంచకప్-2022 సందర్భంగా మొన్‌జురుల్ ఇస్లాం తనపై లైంగిక దాడికి పాల్పడ్డాడంటూ బంగ్లా మహిళా క్రికెట్ జట్టు నాటి కెప్టెన్ జహనారా ఆలం సంచలన ఆరోపణలు చేసింది.

**స్వతంత్ర విచారణ కమిటీ**

ఈ నేపథ్యంలో విచారణ చేపట్టిన బోర్డు.. ఆదివారం తమ తుది నిర్ణయాన్ని వెల్లడించింది. షేర్-ఏ- బంగ్లా నేషనల్ క్రికెట్ స్టేడియంలో సమావేశమైన బోర్డు సభ్యులు.. స్వతంత్ర విచారణ కమిటీ ఇచ్చిన నివేదికను పరిశీలించారు. జహనారా ఆరోపించినట్లుగానే మొన్‌జురెల్‌కు సంబంధించి తమకు ప్రాథమిక ఆధారాలు లభించినట్లు కమిటీ పేర్కొంది. ఈ నేపథ్యంలో.. "బీసీబీ నియమించిన స్వతంత్ర విచారణ కమిటీ ఇచ్చిన నివేదిక మేరకు... మహిళా జట్టు కెప్టెన్ జహనార ఆలం ఆరోపణలు నిజమేనని తేలాయి.

**నిషేధం విధిస్తున్నాం**

ఈ క్రమంలో మొన్‌జురుల్ ఇస్లాంపై నిషేధం విధిస్తున్నాం. బీసీబీ పరిధిలోని క్రికెట్ సంబంధిత వ్యవహారాలతో ఇకపై అతడికి ఎలాంటి సంబంధాలు ఉండవు. కమిటీ చేసిన సిఫారసులను బీసీబీ సమీక్షిస్తుంది. ఈ విషయంలో అదనపు చర్యలకు సంబంధించి త్వరలోనే నిర్ణయం వెల్లడిస్తాం" అని బీసీబీ తమ ప్రకటనలో పేర్కొంది. కాగా బంగ్లాదేశ్ మహిళల జట్టు సెలక్టర్, మేనేజర్‌గా మొన్‌జురుల్ వ్యవహరించాడు. గతేడాది జూన్ 30న అతడి పదవీకాలం ముగిసింది. ఇదిలా ఉంటే.. మహిళా జట్టు సెలక్షన్ ప్యానెల్ చైర్మన్ ఘాజి అష్రఫ్ హొసేన్ పదవీకాలాన్ని నెల రోజుల పాటు పొడిగిస్తున్నట్లు బీసీబీ ఈ సందర్భంగా వెల్లడించింది. ఘాజి స్థానాన్ని త్వరలోనే భర్తీ చేస్తామని.. అందుకోసం కాస్త సమయం పడుతుంది కాబట్టే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది.

**చారిత్రాత్మక ముందుడుగు**


బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు చారిత్రాత్మక? ముందడుగు వేసింది. మహిళల క్రికెట్‌ను ప్రోత్సహించే క్రమంలో వుమెన్ బంగ్లాదేశ్ ప్రీమియర్ లీగ్ (ఔద్బూా) నిర్వహణకు పచ్చజెండా ఊపింది. తొలి ఎడిషన్‌కు ఏప్రిల్ 4- 14 వరకు షెడ్యూల్ ఫిక్స్ చేయగా.. బోర్డు ఇందుకు ఆమోదముద్ర వేసింది. ఢాకా, ఛట్టోగ్రామ్ వేదికగా ఈ మ్యాచ్‌లు జరుగనున్నాయి.

ప్రతిఘటన
తెలుగు దిన పత్రిక
మంగళవారం 24 ఫిబ్రవరి 2026



## విజయ్ సేతుపతి-సాయిపల్లవి కాంబో వచ్చేస్తుంది.. వివరాలివే

మణిరత్నం సినిమాలంటే క్రేజ్ ఎలా ఉంటుందో ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. ఈ స్టార్ డైరెక్టర్ కాంపౌండ్ నుంచి రొమాంటిక్ డ్రామా రాబోతున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాను మణిరత్నం ముందుగా శింబుతో కానీ ధ్రువ్ విక్రమ్‌తో కానీ అంతా చేస్తాడనుకున్నారు. కానీ అనూహ్యంగా ఈ ప్రాజెక్ట్ కోలీవుడ్ స్టార్ యాక్టర్ విజయ్ సేతుపతి చేతిలోకి వెళ్లింది. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన ఆసక్తికర కథనాలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఇందులో సాయిపల్లవి హీరోయిన్‌గా నటించనుంది. తాజా టాక్ ప్రకారం ఇప్పటికే ఏఆర్ రెహమాన్ టీం కొన్ని ట్రాక్స్ కూడా కంపోజ్ చేసిందట. విజయ్ సేతుపతి ప్రస్తుతం చేస్తున్నసినిమాలు పూర్తవగానే.. మణిరత్నం ఈ సినిమాను సెట్స్‌పైకి తీసుకెళ్లేందుకు రెడీ అవుతున్నట్టు సమాచారం. త్వరలోనే ఈ మూవీ అధికారిక ప్రకటన కూడా ఉండబోతుందట. 2025లో థగ్‌లైఫ్ సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చిన మణిరత్నానికి ఈ మూవీ భారీ నిరాశనే మిగిల్చింది. విజయ్ సేతుపతి ప్రస్తుతం జైలర్ 2తోపాటు పలు సినిమాలను లైన్‌లో పెట్టాడు. సాయిపల్లవి జుని ణఱఅతోపాటు ధనుష్‌తో ణ55, రామాయణ పార్ట్ 1, రామాయణ పార్ట్ 2లలో నటిస్తోంది.




## నాని 'ది ప్యారడైజ్' టైటిల్ సాంగ్ ప్రోమో

నాని కొత్త సినిమా 'ది ప్యారడైజ్' నుంచి టైటిల్ సాంగ్ ప్రోమో వచ్చేసింది. ఆయా షేర్... అంటూ వందలాదిమంది డ్యాన్సర్లతో నాని వేసిన స్టెప్పులకు అదిరిపోయేలా అనిరుధ్ రవిచందర్ సంగీతం ఉంది. కాసర్ల శ్యామ్ కుమార్ రచించిన ఈ పాటను అడ్డుల జంగిరెడ్డి, ఆకునూరి దేవయ్య, అనిరుధ్ రవిచందర్ ఆలపించారు. ఫిబ్రవరి 24న పూర్తి సాంగ్‌ను విడుదల చేస్తామని ప్రోమోలో ప్రకటించారు. దర్శకుడు శ్రీకాంత్ ఓదెల తెరకెక్కిస్తున్న ఈ మూవీలో మోహన్‌బాబు, సంపూర్ణేశ్‌బాబు, రాఘవ్ జుయల్, సోనాలి కులకర్ణి నటిస్తున్నారు. భారతీయ భాషలతోపాటు ఇంగ్లిష్, స్పానిష్‌లో ఆగష్టు 21న ఈ మూవీ విడుదల కానుంది. పీరియాడిక్ యాక్షన్ డ్రామాతో రూపొందుతున్న ఈ చిత్రంలో నాని ఒక ప్రేత్యకమైన గెటప్‌లో కనిపించనున్నారు. మొదటి సాంగ్ సినిమాకి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని చిత్రవర్గాలు ఇప్పటికే తెలిపాయి.

## నేచురల్ స్టార్ సరసన బాలీవుడ్ బ్యూటీ?

నేచురల్ స్టార్ నాని వరుస క్రేజీ ప్రాజెక్ట్‌లతో ఫుల్ బిజీగా ఉన్నారు. ప్రస్తుతం ఆయన శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'ది ప్యారడైజ్' అనే హై-వోల్టేజ్ మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో నటిస్తున్నారు. ఇదే కాంబినేషన్‌లో వచ్చిన 'దసరా' బ్లాక్‌బస్టర్ హిట్ కావడంతో ఈ కొత్త ప్రాజెక్ట్‌పై అంచనాలు భారీగా పెరిగాయి. 'ది ప్యారడైజ్'లో నాని పూర్తిగా కొత్త గెటప్‌లో, ఊర మాస్ క్యారెక్టర్‌లో కనిపించనున్నట్లు సమాచారం. ఈ పాత్ర కోసం ఆయన తన లుక్‌ను పూర్తిగా మార్చుకోవడం విశేషం. రగ్డ్ స్టైల్, ఇంటెన్స్ బాడీ లాంగ్వేజ్‌తో నాని మరోసారి మాస్ ఆడియన్స్‌ను టార్గెట్ చేస్తున్నాడని టాక్ వినిపిస్తోంది. 'దసరా'లో చూపించిన రా ఎనర్జీకి మించి ఈసారి మరింత పవర్‌ఫుల్ ప్రెజెన్స్ ఉంటుందని చిత్ర వర్గాలు చెబుతున్నాయి. మరోవైపు, 'ఓజీ' ఫేమ్ సుజీత్ దర్శకత్వంలో నాని ఓ స్టైలిష్ యాక్షన్ డ్రామాకు శ్రీకారం చుట్టాడు. ఈ చిత్రానికి 'బ్లడీ రోమియో' అనే టైటిల్ ఖరారు చేసినట్లు ఇండస్ట్రీలో ప్రచారం జరుగుతోంది. నిహారిక ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై రూపొందుతున్న ఈ మూవీ, సుజీత్ సినిమాటిక్ యూనివర్స్ (రాజఖ)లో భాగమని సమాచారం. ఈ కాంబినేషన్ ప్రకటించగానే అభిమానుల్లో భారీ ఎగ్జైట్మెంట్ నెలకొంది. ఈ ప్రాజెక్ట్‌లో హీరోయిన్‌గా బాలీవుడ్ సెన్సేషన్ తృప్తి డిమ్రీ పేరును పరిశీలిస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే ఆమె సందీప్ రెడ్డి వంగా- ప్రభాస్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న స్పిరిట్‌లో నటిస్తోంది. ఒకవేళ 'బ్లడీ రోమియో'లో కూడా ఆమె ఓకే అయితే, ఇది ఆమెకు రెండో తెలుగు సినిమా అవుతుంది. 'యానిమల్ ' చిత్రంతో నేషనల్ క్రష్‌గా గుర్తింపు తెచ్చుకున్న త్రిప్తి, నాని సరసన నటిస్తే ఆ ప్రాజెక్ట్‌కు మరింత క్రేజ్ రావడం ఖాయం అంటున్నారు సినీ విశ్లేషకులు.



## శ్రీలీలని పలకరిస్తున్న వరుస ఫ్లాపులు.. అయిన కూడా ఏకంగా స్టార్ హీరో సరసన ఛాన్స్?

సౌత్ ఇండస్ట్రీలో యంగ్ హీరోయిన్లలో అచ్చ తెలుగమ్మాయిగా గుర్తింపు తెచ్చుకున్న శ్రీలీల వరుస అవకాశాలతో దూసుకుపోతోంది. ఎనర్జీ, డ్యాన్స్, స్క్రీన్ ప్రెజెన్స్‌తో తక్కువ సమయంలోనే ఆమె మంచి గుర్తింపు సంపాదించింది. రవితేజతో చేసిన ధమాకా ద్వారా తెలుగులో తొలి భారీ హిట్ అందుకున్న ఈ బ్యూటీ, హిట్లు--ఫ్లాపులతో సంబంధం లేకుండా వరుసగా ఛాన్సులు దక్కించుకుంటూ బిజీగా మారింది. తన టాలెంట్‌తో నిర్మాతల దృష్టిని ఆకర్షిస్తూ కమర్షియల్ సినిమాల్లో ప్రత్యేక ఇమేజ్‌ను నిర్మించుకుంది. టాలీవుడ్‌లో స్టార్ హీరోల సరసన నటించిన శ్రీలీల, మాస్ ఎంటర్‌టైనర్ల నుంచి లవ్ స్టోరీల వరకు విభిన్న కథలను ఎంచుకుంటూ కెరీర్‌ను విస్తరించుకుంటోంది. ఇదే సమయంలో కోలీవుడ్‌పైనా దృష్టి సారించింది. శివకార్తికేయన్ హీరోగా తెరకెక్కిన పరాశక్తి చిత్రంతో తమిళ ప్రేక్షకులకు పరిచయమైన ఆమె, అక్కడ కూడా అవకాశాలు అందుకుంటోంది. ఇక తాజాగా ధనుష్ హీరోగా రాజ్ కుమార్ పెరియాసామి దర్శకత్వంలో రూపొందుతున్న 'ణ55' (వర్కింగ్ టైటిల్) ప్రాజెక్ట్‌లో శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ చిత్రాన్ని వండ్ బార్ సంస్థ నిర్మిస్తోంది. ఇందులో సాయి పల్లవి కూడా కీలక పాత్రలో కనిపించనుండటం ఆసక్తిని పెంచుతోంది. ఈ సినిమా ద్వారా కోలీవుడ్‌లో తన స్థానం మరింత బలపరచుకోవచ్చని సినీ వర్గాలు భావిస్తున్నాయి. ఇదిలా ఉంటే, ఇప్పుడు మరో క్రేజీ ప్రాజెక్ట్ విషయంలో శ్రీలీల పేరు గట్టిగా వినిపిస్తోంది. తమిళ స్టార్ అజిత్ కుమార్ హీరోగా తెరకెక్కనున్న కొత్త చిత్రంలో ఆమె హీరోయిన్‌గా ఎంపికయ్యే అవకాశముందని టాక్ నడుస్తోంది. 'గుడ్ బ్యాడ్ అగ్లీ' తర్వాత రేసింగ్‌పై దృష్టి పెట్టిన అజిత్, అదే చిత్ర దర్శకుడు అధిక్ రవిచంద్రన్ తో మరోసారి చేతులు కలపబోతున్నట్లు సమాచారం. ఈ ప్రాజెక్ట్ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందనుందని చెబుతున్నారు. ఈ సినిమాలో అజిత్‌కు సమానంగా బలమైన మహిళా పాత్ర ఉండేలా కథను డిజైన్ చేస్తున్నారని కోలీవుడ్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఆ పాత్ర కోసం శ్రీలీల పేరును పరిశీలిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఒకవేళ ఈ కాంబినేషన్ కుదిరితే, శ్రీలీల కెరీర్‌లో ఇది కీలక మైలురాయిగా మారే అవకాశం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అయితే ఈ విషయంపై చిత్ర బృందం నుంచి ఇంకా అధికారిక ప్రకటన వెలువడలేదు. అయినప్పటికీ సోషల్ మీడియాలో అజిత్--శ్రీలీల కాంబినేషన్‌పై చర్చలు జోరుగా సాగుతున్నాయి.



PRINTED AND PUBLISHED BY KANUGULA SRINIVAS ON BEHALF OF VIPLAV MEDIA PVT. LTD. AT M/S SMIL YS ONLINE, H-NO : 6-7-48 VANASTHALIPURAM SHOPPING COMPLEX, RANGAREDDY DIST, TELANGANA - 500070 AND PUBLISHED AT VIPLAV MEDIA PVT LTD. H-NO: 18-7-496 KANDIKAL GATE, CHARMINAR, HYDERABAD, TELANGANA - 500053. CEO & CHEIF EDITOR: VANGA NAGARAJU, EDITOR: VANGA VIPLAV. UDYAM- TS-02-0308842 PHONE NO: +919394517067, +918499094183.